



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 21 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 13 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




# నకిలీ మద్యంపై సిట్

త్వరలోనే కుట్ర బయటపడుతుంది

ఇది సాధారణంగా జరిగిన నేరం కాదు

- నకిలీ గుట్టు తేల్చేలా ఎక్సైజ్ సురక్ష యాప్
- ఈనెల 16 నుంచి అందుబాటులోకి
- ప్రజారోగ్యమే నాకు ముఖ్యం
- యాచకుల మరణాలనూ 'నకిలీ' ఖాతాలో వేస్తున్నారు
- తప్పుడు ప్రచారం సహించం
- సీఎం చంద్రబాబు హెచ్చరిక
- 'సిట్'లో ఏలూరు ఐజీ అశోక్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

నకిలీ మద్యం వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇది సాధారణంగా జరిగిన నేరం కాదని... భారీ కుట్ర ఉందని తెలిపారు. కుట్రదారులెవరో త్వరలోనే బయటపడుతుందని అన్నారు. ఇందులో దిగ్భ్రాంతికరమైన అంశాలు వెలుగు చూసే అవకాశముందని తెలిపారు. ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. నకిలీ మద్యాన్ని గుర్తించేందుకు 'ఎక్సైజ్ సురక్ష' పేరుతో కొత్త యాప్‌ను ఆవిష్కరించారు. మద్యం సీసాపై ఉన్న బార్ కోడ్‌ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే ఆ సీసా ఉత్పత్తి నుంచి అమ్మకం వరకు అన్ని వివరాలు తెలుస్తాయని... కోడ్ స్కాన్ కాకపోతే అది నకిలీగా నిర్ధారణ అవుతుందని వివరించారు. ఈ యాప్ పనిచేసే తీరుపై ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. మరిన్ని వివరాలు చంద్రబాబు మాటల్లోనే... నకిలీ మద్యం అనేది కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వచ్చిన సమస్య. 2019–24 మధ్య నకిలీ మద్యంప్రారంభమైంది. దాంతోపాటు గంజాయి, డ్రగ్స్ కూడా విచ్చలవిడిగా విస్తరించాయి. వాటిపై ఈ ప్రభుత్వం ప్రక్షాళన ప్రారంభించింది. 'ఈగల్' ద్వారా గంజాయిని నియంత్రించాం. వైసీపీ ప్రభుత్వంలో డిస్టిలరీలను బలవంతంగా లాక్కున్నారు. నచ్చిన బ్రాండ్లు అమ్ముకున్నారు. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లు లేకుండా చేశారు. వాటన్నిటిపై మేం వచ్చాక విచారణ ప్రారంభించాం. అయినప్పటికీ భయం లేకుండా నకిలీ మద్యమంటూ బరితెగించారంటే దీని వెనుక కుట్ర ఉందని అర్థమవుతోంది. నేరస్థులు ఎవరైనా సరే, ఎలాంటి ముసుగు కప్పుకొన్నా, ముసుగు తొలగించి కొరడా ఝులిపిస్తాం! నేను సీఎంగా 15ఏళ్లు పూర్తిచేసుకున్నా. 15ఏళ్లు - మిగతా2లో

## గూగుల్-రైడెన్‌తో రేపే ఒప్పందం

- 2029 నాటికి విశాఖలో డేటా సెంటర్ పూర్తి
- దేశంలోనే అతిపెద్ద డేటా హబ్‌గా విశాఖ
- విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నాం
- ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నాం
- గత తప్పిదాలు పునరావృతం కానివ్వను

2



## ఎన్డీయే సీట్ల సర్దుబాటు ఖరారు!

- భాజపా, జేడీయూకు చెరో 101 స్థానాలు..
- కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్) 29 స్థానాల్లో బరి

6లో



## అర్ధరాత్రి బయటకు ఎందుకొచ్చింది?

- వైద్య విద్యార్థిని రేప్ ఉదంతంపై మమత వివాదాస్పద వ్యాఖ్యలు
- అంత రాత్రివేళ బయటికొస్తుంటే కాలేజీ సెక్యూరిటీ ఏం చేస్తున్నట్లు?
- అయినాసరే బయటకొస్తామంటే
- మీ రక్షణ మీరే చూసుకోవాలని హితవు
- మెడికల్ విద్యార్థుల భద్రతను ప్రైవేట్ కాలేజీ గాలికొదిలేసిందని ఆరోపణ



## కొత్త టీచర్లకు టోకరా!

- స్కూల్ అసిస్టెంట్లకు క్లస్టర్ కాంప్లెక్స్‌ల్లో పోస్టింగ్‌లు
- ఇప్పటికే క్లస్టర్లలో ఐదువేల మంది మిగులు ఉపాధ్యాయులు
- కొందరికి స్కూళ్లు కేటాయించకుండానే జాయినింగ్ రిపోర్టులు
- నేటి నుంచి పాఠశాలల్లో చేరాలని డీఎస్సీ కొత్త టీచర్లకు ఆదేశం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

టీడీపీ కూటమి ప్రభుత్వం డీఎస్సీ–2025 నిర్వహణలోనే కాదు.. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వడంలోనూ ఎక్కడలేని గందరగోళం సృష్టిస్తోంది. స్కూళ్ల ఎంపికలో అభ్యర్థులు ఆప్షన్స్ పెట్టే సమయంలోనూ వారిని తుప్పుదారి పట్టించింది. దీంతో చాలామందికి క్లస్టర్ కాంప్లెక్స్‌లో పోస్టింగ్స్ వచ్చాయి. మరోపక్క.. చాలామంది అభ్యర్థులకు ఏ స్కూలూ కేటాయించకుండానే జాయినింగ్ రిపోర్టులు జారీచేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది. పైగా.. కొత్త టీచర్లు అందరూ సోమవారం వారికి కేటాయించిన స్కూళ్లల్లో రిపోర్టు చేయాలని, వెంటనే విధుల్లో చేరాలని విద్యాశాఖ ఆదేశించింది. - మిగతా2లో

## సాయం పంపిణీకి ఏర్పాట్లు

- గాజాలో కాల్పుల విరమణతో పెరుగుతున్న ఆశలు
- ఈజిప్టులో ట్రంప్ అధ్యక్షతన 'శాంతి శిఖరాగ్రం'

6లో





## యువత.. పాతికేళ్ల భవిత కోరుతున్నారు

ఉచితాలు, పథకాలు కాదు!

పవన్ కల్యాణ్ సంచలన ట్వీట్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదివారం చేసిన ట్వీట్ సంచలనం రేపుతోంది. ఏపీ యువత పాతికేళ్ల భవిష్యత్ కోరుతున్నారని.. ఉచితాలు, సంక్షేమ పథకాలు కాదని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. 2018 అక్టోబరు 12న పవన్ ఉత్తరాంధ్ర పర్యటనలో కొందరు యువకులతో భేటీ నిర్వహించి చర్చలు జరిపారు. అప్పటి ఫొటోను పౌరసరఫరాల మంత్రి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తాజాగా పోస్టుచేశారు. దానిని పవన్ ట్యాగ్ చేస్తూ.. 'ఏపీలో యువత సంక్షేమ పథకాలు, ఉచితాలు అడగడం లేదు. పాతికేళ్ల భవిష్యత్‌ను అడుగుతున్నారు. అందుకే తరచూ వారిని కలుస్తూ వారి కలలను నిజం చేసేందుకు కృషిచేస్తున్నా' అని ట్వీట్ చేశారు. ఇది సర్వత్రా చర్చకు దారితీసింది.

# విశాఖే ఆర్థిక రాజధాని

- జిల్లా దశ, దిశ మారుద్దాం
- అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయం
- ఇక్కడి ప్రజల మద్దతు ఎప్పుడూ టీడీపీకే
- ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రానికి ఆర్థిక రాజధాని విశాఖపట్నమేనని, దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు వీలుగా పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ దిశా నిర్దేశం చేశారు. భవిష్యత్తులో చోటుచేసుకునే మార్పులు, అవసరాలను దృష్టిలో



పెట్టుకుని విశాఖపట్నం దశ, దిశ మార్చేలా ప్రణాళికలు ఉండాలన్నారు. రానున్న ఐదేళ్లలో ఏటీ రంగంలో యువతకు 5 లక్షల ఉద్యోగాలను కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు నాలుగు జిల్లాలు, అరకు, పాడేరుతో కలిపి గ్రేటర్ విశాఖ ఎకనమిక్ జోన్ - మిగతా2లో

## నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ రణభేరి



- నేడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీలు
- ఎక్సైజ్ శాఖ కార్యాలయాల ఎదుట నిరసన, ధర్నా
- అనంతరం అధికారులకు డిమాండ్ పత్రాల అందజేత

2లో

# కొత్త టీచర్లకు టోకరా!

-మొదటిపేజీ తరువాయి

అయితే, ఏ స్కూలూ కేటాయించని తాము ఎక్కడ రిపోర్టు చేయాలో అర్థంగాక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. డీఎస్సీ–2025 ద్వారా ఎంపికైన టీచర్లకుఈనెల 3 నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఆయా కేంద్రాల్లోనే పోస్టింగ్స్ కోసం వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు అనుమతించారు. దీంతో అభ్యర్థులు మండలాల వారీగా ఉన్న స్కూళ్లను ఎంచుకున్నారు. కానీ, చాలామంది అభ్యర్థులకు క్లస్టర్లలో పోస్టింగ్స్ వచ్చాయి. దీంతో వీరు మొదటి నుంచే మిగులు ఉపాధ్యాయులుగా మారినట్లైంది.

**ఆప్షన్ల సమయంలో సర్కారు దొంగాట..**

మరోవైపు.. పాఠశాల విద్యాశాఖ మేలో చేపట్టిన ఉపాధ్యాయుల సాధారణ బదిలీల్లో దాదాపు ఐదువేల మంది స్కూల్ అసిస్టెంట్లు మిగులుగా తేలారు. వీరందరినీ డీఈఓ పూల్, క్లస్టర్ పూల్‌లో ఉంచారు. స్కూళ్లు కేటాయించకుండా ఉపాధ్యాయులను సర్‌ప్లస్ చేయడంపై అప్పట్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో.. డీఈఓ పూల్‌లో ఉన్న టీచర్లను సర్దుబాటు చేసి, క్లస్టర్ పూల్‌లో ఉన్నవారిని అలాగే ఉంచారు. ఇలా ఐదు నెలలుగా వీరికి స్థానాలు కేటాయించలేదు. తాజా డీఎస్సీ%–%2025లో ప్రకటించిన పోస్టుల్లో 7,725 స్కూల్ అసిస్టెంట్ పోస్టులే. ఇప్పుడు కొత్తగా స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికైన అత్యధికులను కూడా క్లస్టర్ కాంప్లెక్స్‌ల్లో వేసినట్లు తెలిసింది. రెగ్యులర్ ఉపాధ్యాయులు సెలవుల్లో వెళ్లినప్పుడు ఆ సమయంలో వీరి సేవలను ఉపయోగించుకుంటారు. అయితే, ఆప్షన్లు ఇచ్చుకునే సమయంలోనే కొత్త టీచర్లను సర్కారు తికమకకు గురిచేసి దొంగాట ఆడినట్లు తెలుస్తోంది.

**ఎక్కడ రిపోర్టు చేయాలో?**



ఇదిలా ఉంటే.. జాయినింగ్ ఆర్డర్ అందిన అభ్యర్థులు సోమవారం తమకు కేటాయించిన స్థానాల్లో రిపోర్టు చేయాలని అధికారులు ఆదేశించారు. కొందరు అభ్యర్థులకు స్థానాలు చూపకపోవడంతో ఎక్కడ రిపోర్టు చేయాలో తెలీక వారు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇలా కొత్త టీచర్లలోని కొందరిని రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్లలో మిగులు ఉపాధ్యాయులుగా మారిస్తే మరికొందరిని ఎటూగాకుండా చేసింది.

**రూ.50 వేల బాండ్ ఇవ్వాలంట..**

ఇదిలా ఉంటే.. సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో నియుమితులైన కొత్త టీచర్లు రూ.50 వేల పూచీకత్తుతో బాండును సమర్పించాలని నిబంధన విధించారు. అంతేగాక.. కనీసం ఐదేళ్లు సొసైటీలో పనిచేస్తామని హామీ ఇవ్వాలని పేర్కొనడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు, కార్పొరేటు కంపెనీలు విధించే నిబంధనలను టీడీపీ కూటమి ప్రభుత్వం పెట్టడంపై వారు దుమ్మెత్తిపోస్తున్నారు.

# విశాఖే ఆర్థిక రాజధాని

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి, ఇతర అంశాలపై ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, అ?ధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బెంగళూరు, పుణే లాంటి నగరాల్లో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు విశాఖలో ఉత్పన్నం కాకుండా చూడాలని, విశాలంగా రోడ్లు అభివృద్ధి చేయాలని సూచించారు. విశాఖ వేదికగా అనేక కంపెనీలు వస్తున్నాయని, రానున్న 30 సంవత్సరాలకు తగ్గట్టుగా మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఇందుకు ప్రజాప్రతిని?ధులు, అ?ధికారుల మధ్య సమన్వయంతో కూడిన మేథోపరమైన చర్చ జరగాలన్నారు. అనేక కంపెనీలు, అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకాబోతున్నాయని, దీంతో ఈ రీజియన్‌లోని యువతకు ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సరైన విధంగా ఆలోచించి ప్రణాళికలు తయారుచేయాలని నిర్దేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేని విధంగా మిషన్ మోడ్‌లో అభివృద్ధి జరగాలని, వారికి ఆమోదయోగ్యమైన విధంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో విశాఖ రీజియన్‌లో ఐటీ పార్కుల ఏర్పాటుకు అనువుగా ల్యాండ్‌బ్యాంకు సిద్ధంచేయాలని ఆదేశించారు.

**టీడీపీకే ప్రజా మద్దతు**

అంతకుముందు రుషికొండలో సిఫీ ఎడ్జ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి లోకేశ్ ఏ–1 కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విశాఖ వాసులు ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీకి పట్టం కడుతున్నారని, వారి పూర్తి మద్దతు టీడీపీకేనని అన్నారు. హుద్‌హుద్ సమయంలో ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబులు నగరానికి వస్తే, అంతటి విపత్కర పరిస్థితుల్లోనూ వారికి చిరునవ్వుతో స్వాగతం పలికిన గొప్ప మనసున్న ప్రజలని ప్రశంసించారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలోని అనేక చోట్ల టీడీపీ నేతలు ఓడిపోతే విశాఖలో టీడీపీకి పట్టం కట్టారన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారని, అప్పుడు కూడా తెల్లవారుజామున మూడు గంటలకు నిద్ర లేచి మూడు లక్షల మంది బీచ్‌కు తరలివచ్చారని గుర్తు చేశారు. విశాఖపట్నాన్ని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా చేస్తామన్నారు. ఐటీలో హైదరాబాద్ 30 ఏళ్లకు అభివృద్ధి సాధిస్తే.. అదే అభివృద్ధిని ఇక్కడ పదేళ్లలో సాధించాలని ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. సమీక్ష సమావేశంలో ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ప్రభుత్వ విప్ పి.గణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఏపీ కోఆపరేటివ్ గ్రోవర్స్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు స్వప్నిల్ దినకర్ పుండర్కర్, రామసుందరరెడ్డి, ఎంఎన్ హరేంధిరప్రసాద్, విజయకృష్ణన్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, విశాఖ జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మా?థుర్, వీఎంఆర్‌డీఏ సీయూపీ శిల్ప ఇతర అ?దికారులు పాల్గొన్నారు.

# అద్దేపల్లి ఫోన్ అదృశ్యం

విజయువాడ

నకిలీ మద్యం కేసులో కరకట్ట బంగ్లా డైరెక్షన్‌తో సాక్ష్యాలను కనుమరుగు చేసే కుట్రలు ముమ్మరమయ్యాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లె జనార్దనరావుకు టీడీపీ పెద్దలతో లింకులు ఉన్నట్లు బహిర్గతం కావడంతో తమ పేర్లు ఎక్కడ బయటికి వస్తాయోనని ముఖ్యనేతలు హడలిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం తయారీ కుటీర పరిశ్రమ తరహాలో విస్తరించిన నేపథ్యంలో జనార్దనరావు నోరు తిప్పితే తమ కొంప కొల్లేరు అవుతుందని ముఖ్యనేతలు ఆందోళన చెందుతున్నారు. నకిలీ మద్యం వెలుగులోకి రావడంతో ప్రభుత్వ ప్రతిష్ట పూర్తిగా మసకబారింది. ఈ నేపథ్యంలో టీడీపీ పెద్దలే నేరుగా రంగంలోకి దిగారు. జనార్దనరావు తమ డైరెక్షన్‌లో లొంగిపోయేలా డ్రామాకు తెర తీశారు. ప్రధానంగా నకిలీ మద్యం వ్యవహారంలో కరకట్ట బంగ్లాకు నెల వారీగా రూ.కోట్లాది ముడుపులు వెళ్లినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు అద్దేపల్లె జనార్దనరావు ఫోన్ తాజాగా అదృశ్యమైంది. జనార్దనరావును అరెస్టు చేసిన తరువాత ఫోన్ గురించి పోలీసులు ఆరా తీయగా ఆఫ్రికా నుంచి వస్తుండగా తన ఫోన్ ముంబై ఎయిర్‌పోర్టులో పోయిందని చెప్పినట్లు కట్టుకథ అల్లారు.

**లొంగిపోయే వరకు టచ్‌లోనే..!**

అద్దేపల్లె జనార్దనరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేసిన తరువాత రాష్ట్రంలో



పలుచోట్ల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మద్యం షాపుల్లో తనిఖీలు చేశారు. అందులో వెల్లడైన విషయాలను వెలుగులోకి రాకుండా తొక్కి పెట్టారు. దీనినిబట్టి కరకట్ట బంగ్లాతో పాటు పలువురు టీడీపీ నేతలకు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు స్పష్టం అవుతోంది. జనార్దనరావు ఫోన్ దొరికితే పలువురు టీడీపీ నేతలతో ఆయనకు ఉన్న లింకులు, ఫోన్ సంభాషణలు వెలుగు చూస్తాయని ముందు జాగ్రత్తగా మాయం చేసినట్లు స్పష్టమవుతోంది. లొంగిపోయే వరకు టీడీపీ పెద్దలతో టచ్‌లో ఉన్నట్లు భావిస్తున్నారు. వారి కనుసన్నల్లోనే కేసును నీరుగార్చే కుట్రలకు పదును పెట్టినట్లు సమాచారం. విదేశాలకు వెళ్లే సమయంలో మైలవరం ప్రజాప్రతినిధి బావ మరిదికి అద్దేపల్లి జనార్దనరావు చివరిగా ఫోన్ కాల్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

# నకిలీ మద్యంపై సిట్

-మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్ష నేతగా ఉన్నా. మొత్తం టీడీపీ ప్రభుత్వం 22ఏళ్లు అధికారంలో ఉంది. కానీ, ఎప్పుడూ చూడని వింత ధోరణి ఇప్పుడు కనిపిస్తోంది. 1995 నుంచి ఇప్పటిదాకా నేను సీఎంగా ఉన్నప్పుడు ఎన్నడూ నకిలీ మద్యం చూడలేదు. దాని గురించి మాట్లాడాల్సిన అవసరం రాలేదు. ఇప్పుడు వైసీపీ వల్లే ఆ పరిస్థితి వచ్చింది. గత ప్రభుత్వంలో నాణ్యత లేకపోవడం, ధరలు పెంచడం వల్ల పక్క రాష్ట్రాల మద్యం రాష్ట్రంలోకి వచ్చింది. మేం ఇవన్నీ నియంత్రించాం. ములకలచెరువు ఘటనలో 16 మందిని, ఇబ్రహీంపట్నం ఘటనలో ఏడుగురిని అరెస్టు చేశాం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు మా పార్టీకి చెందినా చర్యలు తీసుకున్నాం. ములకలచెరువు నకిలీ మద్యం బయటపెట్టిందే మా ప్రభుత్వం. దాని లోతుల్లోకి వెళ్లేకొద్దీ షాకింగ్ విషయాలు తెలుస్తున్నాయి. త్వరలో అవి బయటపెడతాం.

**వీరితోనే సిట్...**

నకిలీ మద్యంపై విచారణకు సిట్‌ను నియమిస్తున్నాం. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ, సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి, టెక్నికల్ ఎస్పీ మల్లికా గార్గ్, ఎక్సైజ్‌లో ఒక అధికారితో సిట్ ఏర్పాటుచేస్తున్నాం. ఆఫ్రికాలో నకిలీ మద్యం తయారీ నేర్చుకుని, దానిని ఏపీలో అమలుచేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇకపై ప్రతి మద్యం షాపులో ప్రతి సీసాను స్కాన్ చేసిన తర్వాతే అమ్మాలి. ఈనెల 16 నుంచి అన్ని మద్యం షాపుల్లో సురక్ష యాప్ అమల్లోకి వస్తుంది. వినియోగదారులు కూడా కొనుగోలు చేసిన సీసాలను స్కాన్ చేసి పరిశీలించాలి. ఏవైనా ఫిర్యాదులుంటే 14405 నంబరుకు కాల్ చేసి చెప్పవచ్చు. షాపులో స్కాన్ చేసిన తర్వాత దానిని బెల్టులకు పంపినా తెలిసిపోతుంది. ఎక్కడైనా బెల్టుల్లో అమ్మితే బెల్టు తీస్తాం!

**కుట్రలో భాగంగా శవ రాజకీయాలు**

కుట్రలో భాగంగా శవ రాజకీయాలు మొదలుపెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో 30వేల మంది నాసిరకం మద్య వల్ల తీవ్ర వ్యాధులకు గురయ్యారు. జంగారెడ్డిగూడెంలో నకిలీ మద్యం తాగి 27 మంది చనిపోతే చిన్న విచారణజరపలేదు. చివరికి మృతులకు పోస్టుమార్టం కూడా చేయించలేదు. ఇప్పుడు రాష్ట్రంలో ఏ కారణంతో చనిపోయినా నకిలీ మద్యం వల్లే అని ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో భయం, అలజడి సృష్టించి, ప్రభుత్వం విఫలమైందనే ముద్ర వేయాలనే కుట్ర చేస్తున్నారు. ఈ ప్రభుత్వం ఎవరితో లాలూచీ పడదు. నకిలీ మద్యం పేరుతో కుట్రలు చేయాలని చూస్తే సాగవు. ఫేక్ వార్తలు వ్యాప్తి చేస్తే సీరియస్ చర్యలుంటాయి. ఆ వార్తల సోర్స్‌పైనా విచారణ చేస్తాం. నిజాలు చెబితే అభినందిస్తాం.

**అదే మీకూ మాకూ తేడా**

వైసీపీ హయాంలో నకిలీ మద్యంతో 27 మంది చనిపోయినా పట్టించుకోలేదు. అదే మా ప్రభుత్వంలో ఏలూరులో ఒకరు చనిపోతే వెంటనే పరీక్షలు చేయించాం. అతను ఇతర కారణాల వల్ల చనిపోయారని తేలినప్పటికీ అది నకిలీ మద్యం వల్లే అని ప్రచారం చేసి పైశాచికానందం పొందుతున్నారు. యాచకుల మరణాలనూ నకిలీ మద్యం ఖాతాలో వేసి శవ రాజకీయం చేస్తున్నారు. తప్పుచేసిన వారిలో రాజకీయ నాయకులు, అధికారులు, ఇంకా ఎవరున్నా వదిలిపెట్టం. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని చూసేవారిని కూడా వదలం.

**నేరాల్లో ఇరుక్కున్నవారికే అలవాటు**

నేరాల్లో ఇరుక్కుపోయినవారికే ఇలాంటి నకిలీ మద్యం నేరాలు చేయడం అలవాటుగా ఉంటుంది. వారు నేరం చేసి ఆ నెపం ఎదుటివారిపై మోపాలని చూస్తారు. గతంలో వివేకాహత్య కేసు ఎలా చేశారో చూశాం. ఇప్పుడు ఎక్సైజ్ మంత్రిని, కార్యదర్శిని విచారించాలని పిచ్చి డిమాండ్లు చేస్తున్నారు. నకిలీ మద్యంపై సీబీఐ దర్యాప్తు కోరడం... కేసుల డైవర్షన్ కోసం కూడా కావొచ్చు. ఎక్సైజ్ అధికారులు జాగ్రత్తగా ఉండాలి. తప్పు చేస్తే కఠిన చర్యలుంటాయి. ఇకపై మీరు తప్పు చేయలేని విధానం తీసుకొస్తాం. మద్యం నాణ్యత పరిశీలన వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలి. నాణ్యతలో చిన్న తేడా వచ్చినా ఊరుకోం.

## గూగుల్-రైడెన్‌తో రేపే ఒప్పందం

అమరావతి

గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌తో మంగళవారం ఒప్పందం చేసుకునేందుకు ఢిల్లీ వెళుతున్నానని, ఇది తన రాజకీయ జీవితంలో అపూర్వ ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2029 నాటికి విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి చేస్తారని చెప్పారు. ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెడుతున్నామని, ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా గూగుల్ వంటి సంస్థలు రాష్ట్రంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో విశాఖపట్నం దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ హబ్‌గా మారబోతోందని అన్నారు. ఓ వైపు డేటా సెంటర్ మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విశాఖపట్నం రూపురేఖలు మారబోతున్నాయని తెలిపారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తుంటే వాటిని అడ్డుకునేందుకు కొందరు బెదిరింపులకు దిగడం ఫ్యాషన్‌గా మారిపోయిందన్నారు. నవంబరులో జరిగే పెట్టుబడుల సదస్సుకు ప్రధాని మోదీని ఆహ్వానించనున్నట్లు తెలిపారు.

**పార్టీలో సీనియర్లకు తగిన గౌరవం**

పార్టీలో సీనియర్లకు తగిన గౌరవం కల్పిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. అదే సమయంలో కొత్త తరాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, యువతరానికి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించేందుకు పార్టీ కార్యాలయంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. 15 ఏళ్లు సీఎంగా ఉండటం గొప్ప విశేషమని ప్రధాని తనకు ఫోన్ చేసి చెప్పినప్పుడు, మీరు 25 ఏళ్లు ప్రభుత్వాధినేతగా (ముఖ్యమంత్రి–ప్రధాని) ఉండటం ఇంకా గొప్ప విశేషమని మోదీకి చెప్పానని అన్నారు. రాష్ట్రంలో వైకుంఠపాళి విధానం వల్ల కొన్నిసార్లు అధికారానికి దూరమయ్యానని చెప్పారు. తాను అధికారానికి దూరంగా ఉండటంలో ప్రజల తప్పు లేదని, తానే కొన్ని జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం బాగుండాలనే ఉద్దేశంతో పరిపాలన చేశానే తప్ప మరేదీ ఆలోచించలేదని, ఇప్పుడు పరిపాలనతో పాటు రాజకీయం కూడా చేస్తున్నానని అన్నారు. గత తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నానని తెలిపారు.

## నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ రణభేరి

అమరావతి

నకిలీ మద్యం తయారీని ఒక పరిశ్రమలా మార్చి, దానిని రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తూ, ప్రజల ప్రాణాలు హరిస్తున్న టీడీపీ నాయకుల వైఖరి, కూటమి ప్రభుత్వ మద్యం విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ రణభేరి మోగించింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఉద్యమ కార్యాచరణ చేపట్టింది. అందులో భాగంగా.. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించనుంది. ఎక్సైజ్ శాఖ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు, ధర్నాల అనంతరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ పత్రాలు సమర్పిస్తారు. నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు వెంటనే రాష్ట్రవ్యాప్తంగా వైన్‌షాప్‌లు, పర్మిట్‌రూమ్‌లు, బార్లు, బెల్టుషాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు చేసి, దీని వెనక ఎంత పెద్దవారున్నా అరెస్టుచేయాలని.. నకిలీ మద్యంపై తక్షణమే సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని డిమాండ్ చేయనున్నారు. నకిలీ, కల్తీ మద్యంవల్ల చనిపోయిన వారిని గుర్తించి, వారి కుటుంబాలను ఆదుకునేలా కూడా చర్యలు చేపట్టాలని పార్టీ నేతలు కోరనున్నారు. ఇక వైన్‌షాప్‌ల కేటాయింపులో జరిగిన అక్రమాలు గుర్తించి, అనర్హులను తొలగించాలని.. మద్యం షాపులను మళ్లీ ప్రభుత్వమే నిర్వహించేలా చొరవ చూపాలని, మద్యం విక్రయ వేళలు కూడా తగ్గించాలని డిమాండ్ చేయనున్నారు. బడులు, గుడులు, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటుచేసిన వైన్‌షాప్‌లు, బార్ల లైసెన్సులు రద్దుచేసేలా ప్రభుత్వానికి ఎక్సైజ్ శాఖ సిఫార్సు చేయాలని నాయకులు డిమాండ్ చేస్తారు.

# డాక్టర్ చల్లా రవికుమార్‌కు మాతృవియోగం




**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జనవిజ్ఞాన వేదిక నవ్యాంధ్ర రాష్ట్ర ప్రథమ అధ్యక్షుడు, మండపేట పట్టణానికి చెందిన ప్రముఖ హెూమియో వైద్యుడు సామాజిక కార్యకర్త డాక్టర్ చల్లా రవి కుమార్ మాతృమూర్తి లక్ష్మి (81) కన్నుమూశారు. శనివారం రాత్రి 10 గంటలకు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా స్వర్గీయ లక్ష్మి భౌతిక కాయాన్ని సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ జిల్లా కోశాధికారి కామ్రేడ్ కే కృష్ణవేణి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు గండి స్వామి ప్రసాద్, లయన్ కురసాల వీర వెంకట సత్యనారాయణ, ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సభ్యులు అద్దేపల్లి వీర్రాజు తదితరులు భౌతిక కాయనికి నివాళులర్పించారు.

# (బ్లాక్ స్పాట్) గుర్తించి ఆ ప్రాంతాల్లో వాహన తనిఖీలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ రహదారిపై వ్యతిరేకలో దిశలో ప్రయాణం అత్యంత ప్రమాదకరం జాతీయ రహదారిపై వ్యతిరేక దిశలో ప్రయాణం అత్యంత ప్రమాదకరమైందని, జాతీయ రహదారుల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆలమూరు ఎస్సై జి నరేష్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో అధికంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల ప్రాంతాలను (బ్లాక్ స్పాట్) గుర్తించి ఆ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, చెముడులంక, మడికి సెంటర్ వద్ద జాతీయ రహదారిపై ముమ్మర తనిఖీలు నిర్వహించి ఇటువంటి ప్రయాణ వలన జరిగే ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన జరిగే దుష్ఫలితాలు పై వాహనదారులు వివరించారు. అనంతరం మద్యం సేవించి (డ్రంక్ అండ్ డ్రైవ్), వ్యతిరేక దిశలో వస్తున్న పలువురు వాహనదారులపై కేసులను నమోదు చేసి అపరాధ రుసుం విధించారు. ఈ దాడుల్లో ఆలమూరు పోలీస్ స్టేషన్ సిబ్బందితోపాటు హైవే పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదాన పథకమునకు విరాళం




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రాలీ శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి అన్నదాన పథకమునకు హైదరాబాద్ వాస్తవ్యులు గన్నారం కృష్ణప్రసాద్ మంజుల దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ & గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి అన్నదాన పథకమునకు రూ.5,116/- లు విరాళంగా సమర్పించియున్నారు. దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించడమైనదని కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు.

# పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ పరీక్ష



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పోస్టల్ డివిజన్ వారిచే దీన్ దయల్ స్పర్శ్ యోజన (స్కాలర్షిప్ ప్రోమోషన్ ఆఫ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఇన్ స్టాంప్స్ హాబీ) పరీక్షను స్థానిక శ్రీ వాగ్దేవి స్కూల్ నందు ఆదివారం నిర్వహించారు. అమలాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో స్పర్శ్ యోజన స్కాలర్షిప్ పోటి పరీక్షను విజయవంతంగా నిర్వహించబడింది. అమలాపురం పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం డివిజన్ పరిధిలో గల వివిధ పాఠశాలల నుండి మొత్తం 195 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు స్పష్టం చేశారు. పోస్టల్ శాఖలో విడుదలైన అనేక రకాల స్టాంప్స్ పైన అవగహాన, జనరల్ నాలెడ్జ్‌ను పెంపొందించేందుకు ఇలాంటి స్కాలర్ పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపతాయని ఎస్పీ నవీన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సబ్ డివిజనల్ ఇన్స్పెక్టర్స్, ఇతర తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

# రోళ్ళ స్వామి నాయుడుని సత్కరించిన ఛాంబర్ ఆఫ్ కామర్స్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ది కమర్షియల్ టాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా ఎన్నికైన రోళ్ళ స్వామి నాయుడు ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున ఈరోజు సాయంత్రం నాలుగు గంటలకు గోల్డ్ మార్కెట్ భవనం వద్ద సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమానికి చాంబర్ అధ్యక్షులు బోనం సత్య వరప్రసాద్ ముఖ్య సలహాదారులు నల్లా పవన్ గౌరవ కార్యదర్శి కొప్పూరి వెంకటరెడ్డి సెక్రెటరీ కొమ్ముర్రి వెంకటాచల ప్రసాద్ వలవల శివరావు అనుపోజు శీను గోల్డ్ మార్కెట్ అధ్యక్షులు మేడిచర్ల త్రిమూర్తుల గోకర కొండ గంగన్న స్వామిరకొండ గంగన్న స్వామి వర్రే బాబి అరిగెల నాని నంద్యాల సత్యనారాయణ ఒంటెద్దు బాబు చవ్వాకుల కృష్ణ కట్టుజో సుబ్బారావు గోకరకొండ బాబులు తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాసంగా సిటీ టీడీపీ క్రికెట్ టోర్నమెంట్

## క్రీడాకారుల్లో ఉత్సాహం ఉరకలు.. : అభిమానుల కేరింతల మధ్య బ్యాట్ పట్టిన ఎమ్మెల్యే వాసు





**రాజమహేంద్రవరం ,విశ్వం వాయిస్ న్యూస్ :** తమ కుటుంబ సభ్యులైన తెలుగుదేశం పార్టీ నాయకులు, యువకులను ఉత్సాహ పరిచేందుకే తాము క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. క్రికెట్ అభిమానులు, స్థానిక నాయకులు, కార్యకర్తల కేరింతల మధ్య ఆయన బ్యాట్ పట్టి బంతిని బాది, క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. సుమారు 10 రోజుల పాటు పేపరు మిల్లు సమీపంలోని లూథరగిరి మైదానంలో జరగనున్న రాజమండ్రి సిటీ తెలుగుదేశం పార్టీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. జట్ల ఎంపిక, మ్యాచ్‌ల డ్రా అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పని చేస్తూ, ప్రజా క్షేత్రంలో ఉంటూ ఒత్తిడికి గురయ్యే తమ పార్టీ నాయకులను ఉత్సాహ పరచడం కోసం, వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహిచడం జరుగుతోందన్నారు. క్రీడలు సమాజ అభివృద్ధిలో, ఆరోగ్య సంరక్షణలో, యువతకి స్ఫూర్తి కల్పించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు, సామాజిక విలువలు, సహనం, జీవన నైపుణ్యాలు అలవడతాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో ప్రవేశించి తన ఆరోగ్యం, నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం కూడా క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పించేందుకు ఎన్నో చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సవితకు గోరంట్ల దంపతులు ఘన సత్కారం



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి రాజమహేంద్రవరానికి విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు సవిత స్థానిక గాంధీపురం గోరంట్ల నివాసానికి విచ్చేసి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసారు.మంత్రి సవితకు గోరంట్ల దంపతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలు విషయాల పై చర్చించారు. వారితో పాటు రాష్ట్ర హెల్త్ వింగ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవి రామకిరణ్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి,ఏ.ఎం.సీ చైర్మన్ మార్ని వాసుదేవ్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాన్ని సత్యనారాయణ, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు పందూరి అప్పారావు, దాలిపర్తి వేమన,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దా మణి,పితాని శివ రామ కృష్ణ,శీలం గోవిందు, తలారి మూర్తి,పిల్ల తనుజ, మట్ట శ్రీను, భీమరశెట్టి రమేష్, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, చలమూరి సత్యనారాయణ,కక్కల రమేష్,కుంచె హనుమంత రావు,సింగవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### అకిరా ఆసుపత్రి వద్ద చనిపోయిన మరణాలకు

# ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యమే కారణం : పెండ్యాల




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ట్రాఫిక్ విధులు నిర్వాహణ సక్రమంగా లేక రాజమండ్రి ప్రజలు విల విల లాడుతున్నారని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయములో జరిగిన పార్టి వారాంతపు సమావేశంలో అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కొన్ని రోజుల క్రితం ఆర్యాపురం వద్ద గల అకీరా ఐ ఆసుపత్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం ముగ్గురు నిండు ప్రాణాలను బలిగొంది. ఆ రోడ్డున ఒక ఆమాత్యుడో, ఒక ఉన్నత అధికారో వెళితేనే ఆ సెంటర్ వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్ వుంటున్నారు. నిత్యం రద్దీగా వుండే ఆ ప్రాంతంలో ఆసుపత్రులు, బస్ స్టాండ్, కాలేజీ, స్కూల్ బస్సులు, పాఠశాలలు, సినిమా థియేటర్స్, ఫంక్షన్ హాల్స్, ప్రసిద్ధి దేవాలయాలు, నిత్యం భక్తుల తిరుగుడులతో ఆ ప్రదేశాలు కిట కిట లాడుతుంటాయి. అలాంటి ప్రధాన రద్ది కూడళ్ళ వద్ద రాజమండ్రి లో ట్రాఫిక్ భద్రత లేకపోయింది. అకీరా ఆసుపత్రి వద్ద జరిగిన నిరక్ష్యానికి కారణంగా ముగ్గురు అకాల మరణానికి గురయ్యారు. అత్యంత బాదాకరంగా మరణించారు.ఆ సెంటర్ లో ట్రాఫిక్ విధులు నిర్వాహణ జరుగుతున్నట్టయితే ఆ ముగ్గురు మరణాలు సంబవించేవి కాదు అనటంలో ఏ మాత్రం సందేహం లేదు. రోజు రోజుకు మరింత రద్ది పెరుగుతున్న ఆ ప్రదేశాల్లో ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీస్ విధులు నిర్వహించే విధంగా పోలీస్ ఉన్నత అధికారులు దృష్టి సారించాలి.రాజమండ్రి లో ఒక్క అకీరా ఆసుపత్రి వద్దనే కాకుండా అనేక ప్రధాన రద్ది ప్రాంతాల్లో కూడా ట్రాఫిక్ పోలీస్ విధులు నిర్వాహణ లేకపోతుంది.ట్రాఫిక్ విధులు మొత్తం హైవే రోడ్ల వద్దను, అనధికార వెహికల్ రికార్డుల తనిఖిలు, గేదెలు, ఆవులు రవాణా జరిగే రోడ్డుల వద్దనే సరిపోతుంది. పై అధికారి నియమించిన డ్యూటీని వదిలి మరి హైవే రోడ్డు ల్లో లాభదాయక విధులు నిర్వహిస్తున్నారు. అవసరం లేనిచోట కూడా కొన్ని వ్యాపార సంస్థలకు మేలు చేయటం కోసం నో పార్కింగ్ బోర్డులు పెడుతున్నారు. అవసరం వున్న చోట బోర్డులు పెట్టరు. అనేక ప్రమాద కర రోడ్డుల వద్ద కనీసం స్థాపర్ బోర్డులు కూడా పెట్టడం లేదు. వున్న బోర్డులు వ్యాపార మాల్స్ కు అవసరం మేరకు ఉపయోగిస్తు వారి నుండి అవినీతి సొమ్ములుకు మార్గం చేసుకుంటున్నారు. ట్రాఫిక్ విధులు అన్ని సామాజిక యాంత్రిక రక్షణ కోసం కాకుండా అధికార దుర్వినియోగ విధులకే ప్రాధాన్యత ఇచ్చుకోవటం గమన్నార్వం అని ఆయన తీవ్ర ఆరోపణ చేసారు. రాజమండ్రి నగరంలో దేవిచౌక్, కంబాల చెరువు, జాంపేట, కందకం రోడ్డు డౌన్, ఇటు గోకవరం బస్ స్టాండ్, కోర్టు సముదాయాలు, విద్యా సంస్థలతో, వ్యాపార సంబంధ మాల్స్ లతో విపరీతమైన రద్ది నిత్యం ఉంటుంది. తూర్పుగోదావరి జిల్లా పోలీస్ ఉన్నత అధికారులు ఆ ప్రాంతాలను గుర్తించి దేవిచౌక్ నుండి పేపర్ మిల్లు రోడ్డు, అటుగా పేపర్ మిల్లు నుండి గోకవరం బస్ స్టాండ్ మార్గాలను పరిశీలించి ఒన్ వే మార్గం ను ప్రకటించమని "రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్" పార్టి అనేక సార్లు పోలీస్ ఉన్నత అధికారులను కొరిందని, ఉన్నత అధికారులు పర్యవేక్షణకు తగు ఆదేశాలు జారిచేసినప్పటికి సంబంధిత ట్రాఫిక్ అధికారులు పెడ చెవిన పెట్టటం పరిపాటిగా మారింది. రాజమండ్రి లో పని చేస్తున్న ట్రాఫిక్ సిబ్బందిలో ఎక్కువ శాతం ఉన్నత అధికారులపై గౌరవం కన్నా వారి వారి సామాజిక వర్గం నేతల ఆశీస్సులు, రాజకీయ నేతల అండ దండలే ముఖ్యంగా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. మొత్తంగా రాజమండ్రిలో ట్రాఫిక్ సేవలు మరుగున పడి ప్రజలు, వాహన దారులు, పాదచారులు విల విల లాడుతున్నారు. ట్రాఫిక్ పోలీస్ లు మొక్కుబడిగా నిర్వహించే తనిఖీలు తప్ప నిరంతర పర్యవేక్షణ కానరాదు. కొన్ని ప్రాంతాల్లో ప్రధాన కూడళ్ళ రోడ్డు కోన మూలాన నెలల తరబడి వాహనాలు నిలిపి ఉంచుతున్నారని, ఆ కారణంగా అటు, ఇటుగా వెళ్ళే వాహనాలు కనపడటం లేదు. అలాంటి కూడళ్ళ వద్ద నిత్యం చిన్న చిన్న ప్రమాదాలు జరుగుతూనే వుంటున్నాయి. తూర్పుగోదావరి జిల్లా పోలీస్ ఉన్నత అధికారి రాజమండ్రి నగర ట్రాఫిక్ విధులపై ప్రత్యేక దృష్టి సారించి ఖచ్చితమైన ట్రాఫిక్ విధి, విధానాలు అమలు కాబడే విధంగా చర్యలు చేపట్టి ట్రాఫిక్ భద్రతను కాపాడ గలరని అర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు కోరారు. సభకు ఆర్పీసీ మరో సీనియర్ సెక్యులర్ సిమ్మా దుర్గారావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ డి.వి రమణమూర్తి, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, వాడపల్లి జ్యోతిష్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా, వల్లి శ్రీనివాసరావు సుంకర వెంకట భాస్కర రంగారావు, యర్రా బాల మురళి కృష్ణ, కాకర ప్రసాద్, చల్లా సాంబశివ రావు, చల్లా అఖిల్, మాసా అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వాయిస్

# గాజాలో శాంతివీచిక!

రెండేళ్ల నుంచి అవిచ్ఛిన్నంగా క్షిపణులు, బాంబుల వర్షంతో కంటిమీద కునుకు లేకుండా గడిపిన గాజా ఇకపై గుండెల నిండా ఊపిరి పీల్చుకోనుంది. హమాస్%-% ఇజ్రాయెల్ యుద్ధం ఆగిపోయిందనీ, ఇరు పక్షాలూ కాల్పుల విరమణకు అంగీకరించాయనీ, శాంతి ప్రణాళికలో ఇది తొలి దశ అనీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన గమనిస్తే పూర్తిస్థాయి శాంతి స్థాపనకు మరికొంత సమయం పట్టొచ్చని స్పష్టంగానే తెలుస్తోంది. ఇంత హడావిడిగా సంధి కుదిరినట్టు ప్రకటించటం వెనక శుక్రవారం ప్రకటించబోయే నోబెల్ శాంతి బహుమతికి అర్హత సాధించటం కోసమేనని అందరికీ తెలుసు. ట్రంప్ అందుకు అర్హుడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సిఫార్సు చేస్తున్నారు. తమ భూభాగంలోకి చొరబడి 2023 అక్టోబర్ 7న 1,100 మంది పౌరులను హతమార్చి, 251 మందిని అపహరించుకుపోయిన హమాస్ దుందుడుకు చర్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ 24 నెలల పాటు గాజాపై నిప్పుల వాన కురిపించింది. ఏ క్షిపణి ఎక్కడ పడుతుందో, ఏ బాంబు ఎవరి ప్రాణం తీస్తుందో తెలియక గాజా వాసులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. జనావాస ప్రాంతాలన్న ఇంగిత జ్ఞానం లేకుండా క్షిపణులు ప్రయోగించటం, ఆకాశాన్నంటే అపార్ట్‌మెంట్లు క్షణంలో కూలి శిథిలాల గుట్టగా మారటం ప్రపంచ ప్రజలంతా చూశారు. కనీసం ఇద్దరో ముగ్గురో మరణించని కుటుంబం లేదు. కొన్ని కుటుంబాలైతే పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. మధ్యలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాలు... ఇజ్రాయెల్ ఉల్లంఘనల వల్ల పెద్దగా ఉపశమనం ఇచ్చింది లేదు. దీన్ని యుద్ధం అనడం ఇజ్రాయెల్ సాగించిన నరమేధాన్ని కప్పిపుచ్చే యత్నమే అవుతుంది. బలాబలాల్లో ఎంత వ్యత్యాసం ఉన్నా రెండు దేశాల మధ్య పరస్పరం కొన సాగే ఘర్షణల్ని యుద్ధం అంటారు. ఇక్కడ జరిగిందంతా వేరు. ఇజ్రాయెల్ లోపాయకారీ మద్దతుతో ఎన్నికల ద్వారా అధికారం చేజిక్కించుకుని గాజా ప్రజలపై పెత్తనం సాగిస్తూ, పాలస్తీనా అథారిటీని బేఖాతరు చేస్తూ వచ్చిన హమాస్ ఉన్నట్టుండి ఉగ్రవాద దాడికి పూనుకొంది. ఇజ్రాయెల్ ప్రతీకార దాడుల్లో అధికారిక లెక్కల ప్రకారమే 67,183 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 1,69,841 మంది గాయాల పాలయ్యారు. వైద్య సిబ్బంది, పాత్రికేయులన్న విచక్షణ లేకపోగా, చాలా సందర్భాల్లో వారిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యాలు హతమార్చటం ఆధునిక చరిత్రలో కనీవినీ ఎరుగనిది. దాడులు ఆగుతాయంటున్నారు గనుక శిథిలాల తొలగింపు మొదలవుతుంది. అప్పుడు గానీ మృతుల అసలు సంఖ్య ఎంతో తెలియకపోవచ్చు. ఇప్పటికీ ఆచూకీ తెలియనివారు వేలల్లో ఉన్నారు. ఇజ్రాయెల్ ఘాతుకాల వెనక జాత్యహంకారం స్పష్టంగా కనబడుతుండగా, ఆ దుండగాన్ని ధర్మబద్ధంగా వ్యతిరేకించినవారిని యూదులపై వివక్ష ప్రదర్శిస్తున్నవారిగా జమకట్టి వేధించటం, విశ్వవిద్యాలయాల్లోకి పోలీసులు చొరబడి అరెస్టులు చేయటం ట్రంప్ నైజానికి అద్దం పడుతుంది. గాజాలో హమాస్ ఒక్కటే లేదు. పాలస్తీనా విమోచన కోసం పోరాడే సంస్థలు డజను వరకూ ఉన్నాయి. ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కి పోలేదు. గాజాలోనే ఒక హద్దు నిర్ణయించుకుని ఆగింది. ఇప్పుడు కుదిరిన ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఎంతవరకూ గౌరవిస్తుందో తెలియదనీ, ఒప్పందంలోని చాలా క్లాజులు అస్పష్టతతో ఉన్నా కేవలం ట్రంప్ హామీని నమ్మి సమ్మతించామనీ ఆ సంస్థల ప్రతి నిధులు చెబుతున్న తీరు గమనార్హం. ట్రంప్‌కు నోబెల్ వస్తే తప్ప ఈ ఒప్పందం సజావుగా ముందుకు పోదు. రెండో దశ చర్చల్లోనే అసలు అంశాలు ప్రస్తావనకొస్తాయి. అప్పుడు మరణమో, శరణమో పాలస్తీనా సంస్థలు తేల్చుకోక తప్పదు. ట్రంప్‌కు పురస్కారం లభిస్తే గాజా వాసులకు ఉన్నంతలో గౌరవప్రదమైన పరిష్కారం దొరకొచ్చు. రాకపోతే పరిణామాలు వేరుగా ఉండే అవకాశం ఉంది. అయితే నరమేధాన్ని కొనసాగించటం ఇక సాధ్యపడకపోవచ్చు. ఎందుకంటే హమాస్ చెరలోని బందీలంతా విడుదలయ్యారు. అటు ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీనా పౌరులు దాదాపు 2,000 మంది విడుదలవుతున్నారు. గాజా విషయంలో ఐక్యరాజ్య సమితిలో అమెరికా, ఇజ్రాయెల్ ఒంటరిగా మిగిలిపోయిన



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం



మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వార్త ఇటీవల జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. ఒక కానిస్టేబుల్ పోస్టుకు 42 మంది పీహెచ్‌డీ స్కాలర్లు సహా 13,000 మంది దరఖాస్తు చేసుకోవడమే ఆ వార్త సారాంశం. ఈ అంకెలు క్షణకాలం పాటు ఆశ్చర్యం కలిగించినా, ఆ తర్వాత అవి మన మనసుల్లో ముద్రపడిపోతాయి. ఆ అంకెల గురించి తెలుసుకోవాలన్న ఆత్రుత వల్ల కాదు. అది మనకు ఏం చెప్తుందన్న ఉత్సుకత అందుకు కారణం. మన దేశంలో అత్యంత విద్యావంతులైన పీహెచ్‌డీ స్కాలర్లు కూడా ప్రాథమిక స్థాయి కొలువుల కోసం లైన్లలో నిల్చుంటున్నారు. ఇది ఏం సూచిస్తున్నది? ఇది దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ లక్షణమా? లేదా విద్య, అవకాశాల మధ్య ఉన్న అసమతుల్యతా? లేదా ప్రభుత్వ ఉద్యోగాల పట్ల మనకున్న శాశ్వత మోజుకు నిదర్శనమా? లేదా భారత శ్రామిక మార్కెట్ గురించి చెప్పలేని ఆందోళనా? అయితే, ఇది ఒక్క మధ్యప్రదేశ్ రాష్ట్రానికే పరిమితం కాదు. రాజస్థాన్‌లో 10 వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు 3.7 లక్షల మంది పోటీపడ్డారు. ఏపీలో వేల పోస్టులకు లక్షల మంది పరీక్షలు రాశారు. ఇది పోలీసు శాఖకు మాత్రమే పరిమితం కాలేదు. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఇటీవల 1,846 ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, దరఖాస్తులు వెల్లువలా వచ్చిపడ్డాయి. స్వీపర్ అయినా కావచ్చు, ఇంజినీర్ అయినా కావచ్చు.. ఆ పోస్టు అర్హతలకు మించినవారు చాలామంది ఎగబడుతున్నారు. ఉద్యోగ భద్రత ఉండే ప్రభుత్వ కొలువు కోసం లక్షల మంది పట్టభద్రులు పోటీపడుతున్నారు. ఇవి నియామకాల్లో కనిపించే గణాంకాలు మాత్రమే కావు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ తన జనాభా సామర్థ్యాన్ని అర్థవంతమైన ఉపాధిగా మార్చుకోలేకపోతున్నదని చెప్పేందుకు నిదర్శనం. మన దేశంలో ఏటా శ్రామిక జనాభా 90 లక్షల వరకు పెరుగుతున్నది. కానీ, ఆ మేరకు ఉద్యోగ సృష్టి మాత్రం జరగడం లేదు. ఆర్థిక వ్యవస్థ వృద్ధి సాధిస్తున్నది కానీ, అందుకు తగ్గట్టుగా ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. కొంతవరకు ఉపాధి సృష్టి జరుగుతున్నా, అవన్నీ అసంఘటిత రంగంలోని ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలే. ఇలాంటి కొలువుల్లో తక్కువ వేతనాలు వస్తాయన్న విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కరోనా మహమ్మారి కాలం ఈ అభద్రతను మరింత పెంచింది. కరోనా తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థ కోలుకున్నప్పటికీ, ఉపాధిరంగం మాత్రం ఇంకా తేరుకోలేదు. నైపుణ్యం ఉన్నవారు (చాలా తక్కువ మంది) టెక్, ఫైనాన్స్ తదితర రంగాల్లో స్థిరపడ్డారు. కానీ, గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లలో చాలామందికి ఉపాధి దొరకడం లేదు. లక్షల మంది తమ విద్యార్హతలతో సంబంధం లేని చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. ఇంకొంతమంది జీవనోపాధి దొరక్క శ్రామికవర్గానికి పూర్తిగా దూరమయ్యారు. ఒకప్పుడు ఉద్యోగ, ఉపాధికి నిచ్చెన లాంటి విద్య.. ఇప్పుడు జీవనోపాధికి గ్యారెంటీ ఇవ్వనిదిగా మారడం బాధాకరం. పీహెచ్‌డీ చేసిన వ్యక్తి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎందుకు దరఖాస్తు చేస్తున్నాడనే విషయాన్ని మనం అర్థం చేసుకోవాలంటే జీతాన్ని కాదు, ఆ కొలువుకు ఉన్న గుర్తింపును చూడాలి. ప్రైవేటురంగంలో అస్థిరత నేపథ్యంలో దేశంలోని చాలా కుటుంబాలు ఉద్యోగ భద్రత వైపు మొగ్గుచూపుతున్నాయి. గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లో సర్కారీ నౌకరీ అంటే జీవనోపాధి మాత్రమే కాదు, సమాజంలో గౌరవానికి అదొక చిహ్నం. పెన్షన్ లాంటి సామాజిక రక్షణలు లేకపోవడంతో ప్రైవేటు రంగంపై యువతలో ఆసక్తి తగ్గిపోతున్నది. ఎవరూ వాటిపై మక్కువ చూపడం లేదు. ఈ నేపథ్యంలో పోలీసు లేదా మున్సిపల్, రెవెన్యూ తదితర శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగమంటే భవిష్యత్ అనిశ్చితిని రూపుమాపే భరోసాలాగా మారిపోయింది. మన దేశంలో విద్యావ్యవస్థల నుంచి బయటికొచ్చే ప్రొడక్ట్‌కు, ఉపాధి మార్కెట్ డిమాండ్‌కు మధ్య నిర్మాణాత్మక అసమతుల్యత ఉంది. గత రెండు దశాబ్దాలుగా ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, సాధారణ డిగ్రీ లాంటి ఉన్నత విద్య కోర్సులు బాగా విస్తృతమయ్యాయి. అయితే, ఇవి మన దేశ ఉపాధిరంగంతో సరితూగడం లేదు. విద్యాసంస్థల్లో బోధించే పాఠ్యాంశాలకు, పరిశ్రమల అవసరాలకు మధ్య పొంతనే ఉండటం లేదు. ఫలితంగా మనం గ్రాడ్యుయేట్ స్థాయి ఉద్యోగాల కంటే వేగంగా గ్రాడ్యుయేట్లను సృష్టిస్తున్నాం. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఈ గ్రాడ్యుయేట్లకు ఉపాధి చూపలేకపోతున్న మార్కెట్.. వారిని తమ అర్హత కంటే తక్కువ స్థాయి ఉద్యోగాలు చేసేలా మెడలు వంచుతున్నది. ఈ అసమతుల్యత ఆర్థిక పరమైన అంశాలను మించి ప్రభావాన్ని చూపుతున్నది. నిరాశను పెంచుతున్నది. ప్రభుత్వాలపై నమ్మకాన్ని తగ్గించడమే కాకుండా, ద్వేషాన్ని పెంచుతున్నది. ఏఐ, ఆటోమేషన్ మన వ్యవస్థలోకి వేగంగా దూసుకొస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కొత్త ఉద్యోగాల సృష్టి మాత్రమే కాదు, ఏది సురక్షితమైన ఉపాధి అనేది నిర్వచించడమూ సవాలుగా మారుతున్నది. ఈ నేపథ్యంలో విద్య, పరిశ్రమలకు మధ్య వారధిగా ఉండే స్థిరమైన కార్మిక-మార్కెట్ వ్యూహం భారత్‌కు అవసరం. అత్యంత విషాదకరమైన అంశమేమిటంటే.. అత్యధిక అర్హత, ఉపాధికి సంబంధించిన ఈ కథనం సమీప భవిష్యత్తులోనూ మారకపోవచ్చు. ఒక కానిస్టేబుల్ పోస్టుకు 13 వేల మంది దరఖాస్తు చేయడాన్ని నిరాశ, నిస్పృహగా మనం చూడకూడదు. ఇది జీవనోపాధి, గుర్తింపు కోసం చేస్తున్న పోరాటానికి ప్రతీక. ఈ ఆర్థిక వ్యవస్థలోకి దూరేందుకు పట్టభద్రులైన నిరుద్యోగులు ఇంకా సర్కారీ కొలువుల కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారనడానికి తార్కాణం.

# తాలిబన్‌లతో సఖ్యత!

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులుండరన్న నానుడి దౌత్యానికి కూడా వర్తిస్తుంది. పైకి ఏం చెబుతున్నా, ఇతరేతర ప్రత్యామ్నాయాల సాధ్యాసాధ్యాలను పరిశీలించటమనే ప్రక్రియ దౌత్యంలో నిరంతరం కొనసాగుతుంటుంది. పర్యవసానంగా ఒక్కోసారి అనూహ్య పరిణామాలు కూడా చోటుచేసుకోవచ్చు. తాలిబన్‌ల ఆధ్వర్యంలోని అఫ్గానిస్తాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకీ గురువారం అయిదు రోజుల భారత సందర్శనకు రావటం అటువంటిదే. ఇది దక్షిణ, మధ్య ఆసియా భౌగోళిక రాజకీయాలను ప్రభావితం చేసే పరిణామం. ప్రపంచ దేశాల్లో రష్యా మినహా మరే దేశమూ ఇంతవరకూ అఫ్గాన్ ప్రభుత్వాన్ని లాంఛనంగా గుర్తించలేదు. మన దేశం తొలిసారి ఆ దిశగా అడుగులేస్తున్నది. అమీర్ ఖాన్ రానున్న సందర్భంగా తాలిబన్‌ను ప్రాంతీయ బృందంలోని భాగస్వామిగా గుర్తించటానికి భారత్ సిద్ధపడింది. తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించటం ఇక లాంఛన ప్రాయం. భద్రతా మండలి ఉగ్రవాదులుగా గుర్తించి ఆంక్షలు విధించిన వారిలో అమీర్ ఖాన్ ఒకరు. దానికింద ఆయన తారసపడితే అరెస్టు చేయాల్సి ఉంటుంది. భారత్ చొరవతో ఈ విషయంలో తాత్కాలికంగా మినహాయింపు లభించింది. తొలిసారి 1996లో అఫ్గాన్ తాలిబన్‌ల వశమైనప్పుడు మనకు ఎన్ని విధాల సమస్య లొచ్చాయో ఎవరూ మరిచిపోరు. సోవియెట్ దురాక్రమణను ప్రతిఘటించి పాలనాధికారాన్ని స్వాధీనం చేసుకున్న తాలిబన్‌లు అనేకమంది మిలిటెంట్లను కశ్మీర్‌కు తరలించారు. పర్యవసానంగా అక్కడ నెత్తురుటేర్లు పారాయి. కేంద్రంలో వాజ్‌పేయి నాయకత్వాన తొలి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక 1999లో ఉగ్రవాదులు ఖాట్మండు నుంచి న్యూఢిల్లీ వచ్చే విమానాన్ని హైజాక్ చేసి అఫ్గాన్‌లోని కాందహార్‌కు తరలించారు. ముగ్గురు ఉగ్రవాదుల్ని విడిపించుకున్నారు. ఈ చర్య వెనక నేరుగా తాలిబన్‌లు లేక పోయినా ఉగ్రవాదులు సురక్షితంగా వెళ్లటానికి సహకరించారు. తాలిబన్‌లతో చర్చలు గానీ, గుర్తింపుగానీ ఉండబోదని అప్పట్లో మన దేశం ప్రకటించింది. ఇంటా, బయటా వారు సాగిస్తున్న అరాచకాలను తీవ్రంగా ఖండించేది. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అమెరికా 2001లో అఫ్గాన్‌ను దురాక్రమించాక ఏర్పడిన ప్రభుత్వాలకు మన దేశం మద్దతుగా నిలిచింది. 2021లో తాలిబన్‌ల పునరాగమనంతో అష్రాఫ్ ఘనీ ప్రభుత్వం పడిపోయేవరకూ మన దేశం పలు అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టింది. రూ. 25,000 కోట్ల వ్యయంతో పార్లమెంటు భవనాన్నీ, సల్మా ఆనకట్టనూ, ఒక జాతీయ రహదారినీ నిర్మించింది. విద్యుదుత్పాదన ప్రాజెక్టులు, విద్య, వైద్యం తదితరాల్లో పాలుపంచుకుంది. ఇవన్నీ తాలిబన్‌లలో సద్భావన కలిగించటంతో పాటు పాకిస్తాన్‌తో వచ్చిన విభేదాలు కూడా వారిని భారత్‌వైపు మొగ్గేలా చేశాయి. పాక్- అఫ్గాన్ దీర్ఘకాల సంబంధాలూ, ఉజ్బెకిస్తాన్ ద్వారా సన్నిహితం కావటానికి పాక్ చేస్తున్న ప్రయత్నాలూ, చైనా వరస మంతనాలూ మన దేశంలో కూడా పునరాలోచన కలిగించాయి. మనం ముందడుగు వేయనట్టయితే ఏదోనాటికి తాలిబన్%-%పాకిస్తాన్ సంబంధాలు మెరుగుపడి, చైనా పలుకుబడి పెరిగి అది మన భద్రతకు ముప్పు కలిగించే అవకాశం కూడా ఉంటుంది. పైగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యూహాత్మకంగా కీలకమైన అఫ్గాన్‌లోని బగ్రాం వైమానిక స్థావరాన్ని తమకు అప్పగించాలని కోరుతున్నారు. ఇది కూడా మన భద్రతను ప్రశ్నార్థకం చేసే పరిణామం. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకోబట్టే తాలిబన్‌లతో సత్సంబంధాలకు మన దేశం సిద్ధపడింది. ఏ దేశానికైనా స్వీయ ప్రయోజనాలు, భద్రత అత్యంత కీలకం. ఆ తర్వాతే మిగిలిన వన్నీ. గత నాలుగేళ్లుగా మన దేశం వేలాది టన్నుల గోధుమలు, వందల టన్నుల మందులు, వ్యాక్సిన్లు, భారీ మొత్తంలో పురుగుమందులు, అత్యవసర సరుకులు పంపింది. ఇటీవల భూకంపం వచ్చినప్పుడు టెంట్లు, మందులు, దుప్పట్లు, జనరేటర్లు అందించింది. కాబూల్‌లో పూర్తిస్థాయి దౌత్య కార్యాలయం కాకపోయినా సాంకేతిక కార్యాలయాన్ని తెరిచింది. తాలిబన్ ప్రభుత్వం ఢిల్లీలో రాయబార కార్యాలయం ప్రారంభించుకోవటానికి అనుమతినిచ్చింది. ఈ అనుకూల వాతావరణంలో అఫ్గాన్‌తో సత్సంబంధాలకు ప్రయత్నించటం అనేక విధాల శుభ పరిణామం.

## సమాచార హక్కు చట్టం- పారదర్శకత

భారత ప్రజాస్వామ్య చరిత్రలో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని బలపరుస్తూ ప్రజలకు పాలనపై ప్రశ్నించే అధికారం కల్పించిన చట్టం సమాచార హక్కు చట్టం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్న మౌలిక సూత్రానికి న్యాయం చేస్తూ, ఈ చట్టం దేశ ప్రజలకు ఒక విప్లవాత్మక సాధనంగా మారింది. భారత పార్లమెంటు ఆమోదంతో రూపొందిన ఈ చట్టం 2005 జూన్ 15న రాష్ట్రపతి ఆమోదం పొందగా, 120వ రోజు అయిన అక్టోబర్ 12, 2005న దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఆ రోజు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ నూతన అధ్యాయంగా నిలిచి పోయింది. సమాచార హక్కు చట్టం పుట్టుక వెనుక ప్రజా ఉద్యమాల సుదీర్ఘ పోరాటం ఉంది. రాజస్థాన్ రాష్ట్రంలో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ వంటి సామాజిక సంస్థలు ప్రభుత్వ ఖాతాల పారదర్శకత కోసం చేసిన పోరాటం ఈ చట్టానికి పునాది వేసింది. “ప్రభుత్వం ప్రజల సొమ్ముతో నడుస్తుంది, కాబట్టి ప్రజలకు లెక్క చెప్పాల్సిందే” అనే నినాదంతో ప్రారంభమైన ఆ ఉద్యమం దేశవ్యాప్త చైతన్యానికి దారితీసింది. చివరికి యూపీఏ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమాచార హక్కు బిల్లును రూపొందించి పార్లమెంటులో ఆమోదింప జేసింది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం... ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను, బాధ్యతను పెంచడం. ప్రభుత్వ నిర్ణయాలు, ఫైళ్లు, కాంట్రాక్టులు, టెండర్లు, ఖర్చులు వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా అవినీతి తగ్గించడం, ప్రజా నిధుల వినియోగాన్ని సక్రమంగా పర్యవేక్షించడానికి ప్రజలకు అవకాశం కల్పించడం దీని లక్ష్యం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కింద పౌరులకు ఇచ్చిన మాటల స్వేచ్ఛలో భాగంగానే సుప్రీంకోర్టు సమాచార హక్కును మౌలిక హక్కుగా పరిగణించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి పౌరుడికి ప్రభుత్వం నుండి సమాచారాన్ని అడిగే చట్టబద్ధ హక్కు ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలు ప్రజలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత వహించాలి. దరఖాస్తు లిఖిత పూర్వకంగా లేదా ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చు. సాధారణంగా సమాచారం ఇవ్వడానికి 30 రోజులు గడువు ఉంటే, జీవితం లేదా స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో 48 గంటల్లోపే సమాధానం ఇవ్వాలి. సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగితే లేదా నిరాకరించినట్లయితే సంబంధిత అధికారిపై రోజుకు రూ. 250 చొప్పున జరిమానా విధించే అవకాశం చట్టంలో ఉంది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రజలు దీన్ని శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, భూముల రికార్డులు, విద్యా నియామకాలు, స్థానిక సంస్థల ఖర్చులు వంటి అనేక అంశాల్లో పౌరులు సమాచారాన్ని కోరారు. అనేక అవినీతి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మహారాష్ట్రలో భూసంబంధిత అవినీతి కేసులు, ఢిల్లీలో పాఠశాల భవనాల నిర్మాణంలో జరిగిన మోసాలు, బడ్జెట్ వినియోగాల్లో గోప్యతల ఉల్లంఘనలు ఈ చట్టం ద్వారానే బహిర్గతమయ్యాయి. ప్రజల చేతుల్లో ఈ చట్టం నిజమైన ప్రజాస్వామ్య పరికరంగా మారింది. చట్టం అమలుకు సంబంధించి కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర సమాచార కమిషన్లు ఏర్పాటు చేయబడ్డాయి. సమాచారం ఇవ్వని అధికారులను ప్రశ్నించడం, ప్రజల పిటిషన్లను విచారించడం వీటి బాధ్యత. తొలి కేంద్ర సమాచార కమిషనర్ వాజహత్ హబీబుల్లా కాగా, అనేక రాష్ట్రాల్లోనూ ఇలాంటి కమిషన్లు ఏర్పాటయ్యాయి. ఈ కమిషన్లు పౌరుల హక్కులను కాపాడడంలో, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతను తీసుకు రావడంలో విశేష పాత్ర పోషించాయి. 2019లో చట్టంలో జరిగిన సవరణలతో కమిషనర్ల పదవీకాలం, వేతనాల నిర్ణయాధికారం కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వబడింది. ఈ మార్పులు పారదర్శకతను బలహీన పరిచే అవకాశం ఉందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఇంకా ప్రభావవంతమైన సాధనంగానే ఉంది. అయితే దాని వినియోగం తగ్గిపోవడం, సమాచారం ఇవ్వడంలో ఆలస్యం, కొన్నిసార్లు సమాచారం కోరిన వ్యక్తులపై దాడులు జరగడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజల కంటిచూపును నిలబెట్టే వ్యవస్థ ఇది. ప్రజాస్వామ్యం సజీవంగా ఉండాలంటే ప్రతి పౌరుడు ఈ చట్టాన్ని తెలుసుకొని వినియోగించాలి. అక్టోబర్ 12, 2005న భారత ప్రజాస్వామ్యం మరింత బలపడిందిబీ ప్రజల చేతిలో ఒక పెన్నుతో సత్యాన్ని వెలికితీసే శక్తి అప్పగించబడిన రోజు అది.

### ప్రజలే నిర్ణయించాలి..

# రుషికొండపై పబ్లిక్ ఒపీనియన్‌కు ప్రత్యేక వెబ్ సైట్



ఈ నేపథ్యంలో వాటిని ఎలా వినియోగించుకోవాలనే అంశంపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. విశాఖలోని రుషికొండపై రూ.450 కోట్లతో నిర్మించిన అత్యంత విలాసవంతమైన భవనాలను ఎలా వినియోగించాలో తేల్చుకోలేని కూటమి ప్రభుత్వం.. ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని భావించింది. గత ప్రభుత్వం ఎంతో రహస్యంగా నిర్మించిన రుషికొండ భవనాల నిర్వహణే భారంగా మారిందని కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. పర్యాటక శాఖ పరిధిలో నిర్మించిన ఈ భవనాలు టూరిజం అభివృద్ధికి కూడా ఉపయోగపడే అవకాశం లేదని కూటమి మంత్రులు తేల్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాటిని ఎలా వినియోగించుకోవాలనే అంశంపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలోని రుషికొండపై పున్నమి రిసార్ట్ ను తొలగించి వాటి స్థానంలో అత్యంత విలాసమైన నాలుగు భవనాలను నిర్మించారు. ఈ భవన నిర్మాణాల సమయంలోనే తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. పర్యావరణ అనుమతులు లేకుండా, కొండను తొలచి భవనాలను నిర్మిస్తున్నారని అప్పటి ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు పలుమార్లు ఆందోళనలు నిర్వహించాయి. ప్రతిపక్ష నేతలుగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఆయా భవనాలను సందర్శించి ప్రభుత్వ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శలు గుప్పించారు. అయితే ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా అప్పటి ప్రభుత్వంలో ఉన్న వైసీపీ మొండిగా భవన నిర్మాణాలు పూర్తిచేసింది. అత్యంత వివాదాస్పదంగా మారిన రుషికొండపై భవనాలు నిర్మాణం పూర్తయిన వెంటనే ఎన్నికలు రావడం, వాటి ప్రారంభం వాయిదా పడింది. అప్పట్లో విశాఖను పాలనా రాజధానిగా చేస్తామని ప్రకటించిన మాజీ సీఎం జగన్మోహనరెడ్డి తన క్యాంపు కార్యాలయం కోసమే ఆ భవనాలు నిర్మించారని ప్రచారం జరిగింది. అయితే కోర్టు వివాదాల వల్ల ఆ విషయాన్ని వైసీపీ బహిరంగంగా ప్రకటించలేకపోయింది. ఇక అధికారం చేతులు మారిన తర్వాత రుషికొండ నిర్మాణాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వైసీపీని మరింత డామేజీ చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నించింది. అంతేకాకుండా రూ.450 కోట్లు పెట్టి ఎందుకూ పనికిరాని భవనాలను నిర్మించారని ప్రచారం చేసింది. మరోవైపు భవనాలను ఎలా వినియోగించాలనే అంశాలపై సూచనలు సలహాలు ఇవ్వాలని మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో నాలుగు నెలల తర్వాత ఇటీవల సమావేశమైన మంత్రుల కమిటీ భవనాల వినియోగంపై చర్చించింది. ఇదే సమయంలో ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని నిర్ణయించి ప్రత్యేక వెబ్ సైట్ సిద్ధం చేసింది. రుషికొండ ప్యాలెస్ వినియోగంపై ప్రజలు తమ సలహాలు, సూచనలను **rushikonda@aptdc.in** అనే వెబ్ సైట్ లో నమోదు చేయొచ్చని వెల్లడించింది. ఈ నెల 17 లోగా సూచనలు పంపాలని నిర్దేశించింది ప్రభుత్వం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని కీలక అంశాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటోంది. అమరావతిలో ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి ఇదేవిధంగా ఓపీనియన్ పోల్ నిర్వహించగా, తాజాగా రుషికొండపైన అదే పంథాలో ప్రభుత్వం ముందుకెళుతోందని అంటున్నారు.

### బ్రిటన్ మాజీ ప్రధానికి మైక్రోసాఫ్ట్‌లో

# కీలక బాధ్యతలు.. ఏంటి కథ?



యూకే మాజీ ప్రధాన మంత్రి రిషి సునక్ తన రాజకీయ జీవితం తర్వాత మరో కీలకమైన అంతర్జాతీయ బాధ్యతను స్వీకరించారు. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో సీనియర్ అడ్వైజర్‌గా ఆయన నియమితులయ్యారు. యూకే ప్రభుత్వానికి చెందిన అడ్వైజరీ కమిటీ ఆన్ బిజినెస్ అపాయింట్‌మెంట్స్ ఈ నియామకాన్ని అధికారికంగా ఆమోదించింది. ఇదే సంస్థ ఇటీవల ఆయనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ **Anthropic**లోనూ ఇలాంటి పాత్రకు అనుమతి ఇచ్చింది.

**భాగకాలిక బాధ్యతలు, కీలక సలహాలు**

సునక్‌కి మైక్రోసాఫ్ట్‌లో పార్ట్ టైం బాధ్యతలు ఉంటాయి. ఆయన ప్రధానంగా గ్లోబల్ స్ట్రాటజీ, ఎకానమీ, టెక్నాలజీ పాలసీపై సలహాలు ఇవ్వనున్నారు. అలాగే మైక్రోసాఫ్ట్ సమ్మిట్ వంటి ముఖ్యమైన ఈవెంట్లలో పాల్గొంటారు. ఈ పదవిలో ఆయన పొందే మొత్తం వేతనాన్ని తన భార్య అక్షతా మూర్తితో కలిసి స్థాపించిన 'ది రిచమండ్ ప్రాజెక్ట్' అనే చారిటీకి విరాళంగా ఇవ్వనున్నారు.

**లాబీయింగ్‌కి, ప్రభుత్వ సమాచార వినియోగానికి నిషేధం**

ఎలాంటి ప్రయోజన విరోధాలు రాకుండా ఉండేందుకు సునక్‌పై కొన్ని ఆంక్షలు విధించబడ్డాయి. ఆయన యూకే ప్రభుత్వాన్ని లాబీ చేయకూడదు. ప్రధానిగా ఉన్నప్పుడు పొందిన లోపలి సమాచారాన్ని ఉపయోగించకూడదు. మైక్రోసాఫ్ట్‌కు యూకే ప్రభుత్వ పాలసీలపై సలహాలు ఇవ్వడాన్ని రెండేళ్లపాటు నిషేధించారు.

**టెక్ & AI రంగంపై సునక్ దృష్టి**

ప్రధానిగా ఉన్నప్పుడే రిషి సునక్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (%ా×%) రంగాలపై విశేష ఆసక్తి కనబరిచారు. ఆయన నేతృత్వంలోనే చారిత్రకమైన ఏఐ సేఫ్టీ సమ్మిట్ బ్లెచ్లీ పార్క్‌లో జరిగింది. అలాగే మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీలను యూకేలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించారు. ఈ కొత్త బాధ్యత ఆయన టెక్ రంగంపై ఉన్న దీర్ఘకాల దృష్టిని ప్రతిబింబిస్తోంది.

**మిశ్రమ స్పందనలు, నైతిక ప్రశ్నలు**

సునక్ నియామకంపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన అనుభవం మైక్రోసాఫ్ట్‌కు గ్లోబల్ పాలిటిక్స్, ఎకానమీ సమస్యల్లో మార్గదర్శకంగా ఉంటుందని మద్దతుదారులు భావిస్తున్నారు. అయితే, విమర్శకులు మాత్రం "రాజకీయ నాయకులు, కార్పొరేట్ సంస్థల మధ్య రీవాల్వింగ్ డోర్" పద్ధతిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మైక్రోసాఫ్ట్ యూకే ప్రభుత్వంతో అనేక ఒప్పందాలు కలిగి ఉన్న నేపథ్యంలో ఈ నియామకం నైతిక ప్రశ్నలకు దారి తీస్తోంది.

**గ్లోబల్ అడ్వైజర్‌గా కొత్త అధ్యాయం**

ఆంతోపిక్, గోల్డ్ మన్, సాచెస్.. ఇప్పుడు మైక్రోసాఫ్ట్ ఈ మూడు పెద్ద సంస్థలతో కలిసి సునక్ తన తర్వాతి అధ్యాయాన్ని గ్లోబల్ అడ్వైజర్‌గా మలుచుకుంటున్నారు. ఈ నియామకాలతో టెక్నాలజీ, నైతికత, ఇన్నోవేషన్, డిజిటల్ భవిష్యత్తుపై ఆయన దృష్టి కేంద్రీకృతం కావడం స్పష్టమైంది. రిషి సునక్ కొత్తగా టెక్ ప్రపంచంలో గ్లోబల్ మార్గదర్శకుడిగా రూపుదిద్దుకుంటున్నారు.

### ఆపరేషన్ బ్లూ స్టార్..

# ఇందిరాగాంధీ చేసిన అతిపెద్ద పొరపాటు అదే..



మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ హయాంలో జరిగిన 'ఆపరేషన్ బ్లూ స్టార్' నిర్ణయంపై ఆయన చేసిన వ్యాఖ్యలు చరిత్రలోని ఒక సున్నితమైన అంశాన్ని మళ్లీ వెలుగులోకి తెచ్చాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని కసౌలిలో జరిగిన ఒక సాహిత్య కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశ రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీశాయి. మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ హయాంలో జరిగిన 'ఆపరేషన్ బ్లూ స్టార్' నిర్ణయంపై ఆయన చేసిన వ్యాఖ్యలు చరిత్రలోని ఒక సున్నితమైన అంశాన్ని మళ్లీ వెలుగులోకి తెచ్చాయి.

ఆపరేషన్ బ్లూ స్టార్: అసలు పొరపాటు ఏంటి?

చిదంబరం తమ వ్యాఖ్యల్లో 1984 జూన్‌లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న స్వర్ణ దేవాలయం నుండి మిలిటెంట్లను బయటకు పంపడానికి తీసుకున్న సైనిక చర్య 'తప్పుడు మార్గం' అని స్పష్టం చేశారు. "స్వర్ణ దేవాలయాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి, మిలిటెంట్లను పట్టుకోవడానికి మరో మార్గం ఉంది. కానీ ఆపరేషన్ బ్లూ స్టార్‌తో తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నారు" అని చిదంబరం అభిప్రాయపడ్డారు. "ఆ పొరపాటుకు ఇందిరా గాంధీ తన ప్రాణాలను కోల్పోయారని నేను అంగీకరిస్తున్నా," అంటూ ఆ నిర్ణయం యొక్క తీవ్ర పరిణామాన్ని నొక్కి చెప్పారు. దేవాలయాన్ని స్వాధీనం చేసుకునే ప్రక్రియలో సైన్యాన్ని దూరంగా ఉంచాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనికి భిన్నంగా, కొన్ని సంవత్సరాల తర్వాత జరిగిన ఆపరేషన్ బ్లాక్ థండర్ లో ఆర్మీని దూరంగా ఉంచడం ద్వారా సరైన మార్గం చూపించబడిందని ఆయన పోల్చి చెప్పారు. ఇందిరా గాంధీ ఒక్కరిదే పొరపాటు కాదన్న చిదంబరం ఆ నిర్ణయాన్ని పూర్తిగా ఇందిరా గాంధీకే ఆపాదించడం సరికాదని చిదంబరం స్పష్టం చేశారు. ఆపరేషన్ బ్లూ స్టార్ నిర్ణయం కేవలం ఇందిరా గాంధీ వ్యక్తిగత నిర్ణయం కాదని, అది సైన్యం, పోలీసులు, నిఘా సంస్థలు.. పౌర పరిపాలనా వ్యవస్థల సమిష్టి నిర్ణయం అని ఆయన వివరించారు. "అందులోని బాధ్యతను కేవలం ఇందిరా గాంధీపై మాత్రమే మోపడం సరికాదు" అని ఆయన అన్నారు.

ఆపరేషన్ బ్లూ స్టార్ నేపథ్యం ఏంటి?


1980ల ప్రారంభంలో పంజాబ్‌లో వేర్పాటువాద ఉద్యమం ఉధృతమైంది. వివాదాస్పద సిక్కు నేత జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే తన అనుచరులతో కలిసి అమృత్‌సర్‌లోని పవిత్ర హర్‌మందిర్ సాహిబ్ (స్వర్ణ దేవాలయం) కాంప్లెక్స్‌ను స్థావరంగా మార్చుకున్నారు. వేర్పాటువాద కార్యకలాపాలు, హింస పెరగడంతో, 1984 జూన్ 1 నుండి 8 వరకు ఇందిరా గాంధీ ప్రభుత్వం మేజర్ జనరల్ కుల్దీప్ సింగ్ బ్రార్ ఆధ్వర్యంలో ఈ సైనిక చర్యకు ఆదేశించింది. ఈ చర్యలో భింద్రన్‌వాలే సహా అనేక మంది వేర్పాటువాదులు, సాధారణ పౌరులు మరణించారు. 83 మంది భారత సైనికులు అమరులయ్యారు.

ఇందిరా గాంధీ హత్య ఈ సంఘటన సిక్కు సమాజాన్ని తీవ్రంగా కలచివేసింది. దీనికి ప్రతీకారంగా ఆపరేషన్ జరిగిన కొద్ది నెలలకే, 1984 అక్టోబర్ 31న ఇందిరా గాంధీ తన సొంత సిక్కు అంగరక్షకుల చేతిలో హత్యకు గురయ్యారు.

చిదంబరం వ్యాఖ్యల ప్రాధాన్యం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్న సీనియర్ నాయకుడిగా, చిదంబరం ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ చరిత్రలోని ఒక సున్నితమైన అంశాన్ని అంగీకరించడం ద్వారా, ఆయన ఆనాటి నిర్ణయం యొక్క తీవ్రమైన పరిణామాలను గుర్తు చేశారు. పంజాబ్‌లో ఖలిస్తాన్ వాదన దాదాపు తగ్గిపోయిందని, కానీ రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితి ప్రధాన సమస్యగా మారిందని కూడా ఆయన పేర్కొన్నారు.

# బీజేపీ బలమేంటో చెప్పిన ఓవైసీ

ప్రతిపక్ష పార్టీలు అలసత్వం వహిస్తే, "రెప్పపాటులోనే బీజేపీ తన పని పూర్తి చేస్తుంది" అంటూ ఆయన తీవ్రంగా హెచ్చరించారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాజకీయంగా అత్యంత చురుకైన, అప్రమత్తమైన పార్టీ అని ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీలు అలసత్వం వహిస్తే, "రెప్పపాటులోనే బీజేపీ తన పని పూర్తి చేస్తుంది" అంటూ ఆయన తీవ్రంగా హెచ్చరించారు. బీజేపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది! హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఒవైసీ, బీజేపీ పనితీరును వివరిస్తూ ప్రతిపక్షాలకు ఒక రకంగా హెచ్చరిక పంపారు. బీజేపీ ఒక "24 గంటలూ పని చేసే పార్టీ" అని ఆయన అభివర్ణించారు. వారి వ్యూహాలు చాలా పక్కాగా ఉంటాయని, రాజకీయాల్లో వారు ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలకు సూచన "ప్రతిపక్షాలు అప్రమత్తంగా లేకపోతే, బీజేపీ తన లక్ష్యాలను సాధించడానికి పెద్దగా సమయం పట్టదు" అని, కేవలం రెప్పపాటులో వారు తమ పని పూర్తి చేస్తారని వ్యాఖ్యానించారు. ఓటు చోరీ ఆరోపణలు, ఓటర్ల జాబితా తనిఖీ ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన 'ఓటు చోరీ' ఆరోపణలను ఆయన ఖండించారు. 2009, 2014 ఎన్నికల సమయంలోనే తన నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో డూప్లికేట్ పేర్లను గుర్తించి తాను సవాల్ చేశానని ఒవైసీ గుర్తు చేశారు. ప్రతి పార్టీ కూడా కేవలం ఆరోపణలు చేయడం కాకుండా, ఓటర్ల లిస్టును సీరియస్‌గా తనిఖీ చేయాలని ఒవైసీ సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అవగాహన, ప్రతి ఓటు విలువ చాలా ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీజేపీ తన శక్తిని, విస్తరణను పెంచుకుంటున్న తరుణంలో, బీజేపీ బలంపై ఒవైసీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రతిపక్షాల ఐక్యత, వ్యూహాలపై కొత్త చర్చకు దారితీస్తున్నాయి. ప్రతిపక్షాలు తమ కార్యాచరణను పునఃపరిశీలించుకోవాల్సిన అవసరాన్ని ఆయన మాటలు బలంగా స్పష్టం చేస్తున్నాయి.



బీజేపీ ప్రధాన బలాలు బలమైన జాతీయవాద భావజాలం హిందుత్వం : భారతీయ సంస్కృతి, హిందూ మతం..ఇతర భారతీయ మతాల (జైన, సిక్కు, బౌద్ధ) రక్షకురాలిగా తనను తాను భావించడం. జాతీయవాదం, సాంస్కృతిక సంప్రదాయాలను బలంగా నమ్ముతుంది.


**భావసారూప్యత:** ఈ భావజాలం పార్టీకి కోర్ ఓటర్లను మరియు పటిష్టమైన మద్దతుదారుల సమూహాన్ని అందిస్తుంది. పటిష్టమైన సంస్థాగత యంత్రాంగం : బీజేపీకి దేశవ్యాప్తంగా బలమైన పార్టీ యంత్రాంగం ఉంది. బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు కమిటీలు, కార్యకర్తల నెట్‌వర్క్ చాలా పటిష్టంగా ఉంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీలలో ఒకటిగా 170 మిలియన్లకు పైగా సభ్యులు ఉన్నట్లు పేర్కొంది (2022 నాటికి). కేంద్రంలో అధికారం - నాయకత్వం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జనాదరణ.. నిర్ణయాత్మక నాయకత్వం పార్టీకి ప్రధాన బలం. ఆయన నేతృత్వంలో కేంద్రంలో వరుసగా మూడుసార్లు (కూటమితో కలిపి) ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది.

**చారిత్రక విజయాలు:** 1984లో కేవలం 2 సీట్లతో మొదలై, 2019 లోక్‌సభ ఎన్నికల్లో 303 సీట్లు గెలుచుకోవడం ఈ పార్టీ బలాన్ని సూచిస్తుంది. కీలక విధాన నిర్ణయాలు : ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి హామీలను నెరవేర్చడం ద్వారా తమ నిబద్ధతను నిరూపించుకుంది. అవినీతి రహిత పాలన అందిస్తున్నామని చెప్పుకోవడం, అలాగే అనేక సంక్షేమ మరియు అభివృద్ధి పథకాలు (ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గ్యాస్ కనెక్షన్లు, టాయిలెట్లు, తాగునీటి సదుపాయం) అమలు చేయడం. కూటమి బలం : నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ కూటమిని ఏర్పాటు చేయడం ద్వారా లోక్‌సభలో సంఖ్యా బలాన్ని పెంచుకొని కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. మొత్తంగా బీజేపీతో పోలిస్తే కాంగ్రెస్ సహా ఏ ప్రతిపక్షం కూడా బలమైన ప్రత్యర్థిగా కనిపించడం లేదు. అందుకే ఓవైసీ కూడా బీజేపీ ఏమరపాటుగా ఉంటే ఏసేస్తుందని స్పష్టం చేశాడు.

# మానవత్వం మరిచిన మానవతా తీరు..

PART 2

- విద్యార్థులను మండుటెండలో వేధించిన వారికి నోటీసులు, వివరణ కోరిన జిల్లా విద్యాశాఖ అధికారులు
- విరాళాలు ఇచ్చారు కనుక అనుమతి ఇచ్చామన్న ప్రధానోపాధ్యాయురాలు
- బహుమతుల ప్రధానానికి అనుమతులు అవసరం, విద్యార్థులను వేధించడానికి అనుమతి అవసరం లేదా.?
- మండలంలో అసలు విద్యాశాఖ అధికారులు ఉన్నారా.?
- ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు..? తల్లిదండ్రుల ఆందోళన
- విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పూర్వ విద్యార్థులు డిమాండ్





ప్రమాదకర రహదారులలో ఉపాధ్యాయుని పర్యవేక్షణ లేకుండా విద్యార్థుల సైకిల్ యాత్ర


ఫైల్ ఫొటో..


ఫైల్ ఫొటో..

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పర్యావరణంపై ప్రేమను ఒలకపోస్తూ ప్రకటనలతో హోరెత్తించే విశ్వ మానవతా సంస్థ. కోనసీమ సైకిల్ యాత్ర పేరుతో, పాపం,పుణ్యం తెలియని విద్యార్థుల పై కరత్వాన్ని ప్రదర్శిస్తూ, అక్టోబర్ 5వ తేదీన మండుటెండలో రాయవరం శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాల,బాలికలను రాయవరం మండలమే కాక, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలంలో ని పలు గ్రామాలకు సైకిల్ పై తిప్పుతూ మంచినీళ్లైనా ఇవ్వకుండా వేధించిన విధానం "మానవత్వం మరిచిన మానవతా తీరు" కథనం ద్వారా పాఠకులకు విదితమే.. కాగా ఈ విషయంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషాను మా ప్రతినిధి వివరణ కోరగా. ఆయన స్పందిస్తూ జరిగిన సంఘటన పై పాఠశాల, విశ్వ మానవతా సంస్థ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపుతూ మరింత సమాచారం కోసం డివైఈవో రామలక్ష్మణ మూర్తి తో మాట్లాడాలని సూచించారు. ఈ విషయంపై అక్టోబర్ 06 వ తేది నుండి డివైఈవో ను సమాచారం కోరగా, శుక్రవారం ఆయన ఫోన్ సంభాషణ ద్వారా వివరాలు తెలియచేస్తూ, జరిగిన సంఘటన పై పాఠశాల నుండి వివరణ కోరామని దానికి ప్రతిగా పాఠశాల నుండి ప్రధానోపాధ్యాయురాలు శాంతి సునీత స్పందించారని ఆమె ఇచ్చిన వివరణను ఆయన విలేకరులతో చెప్పగా," ఆ వివరణ పలు ప్రశ్నలకు దారి తీస్తుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాల భవనం నిర్మాణానికి విశ్వ మానవతా సంస్థ నిర్వాహకులైన అల్లూరి శ్రీనివాస్ చౌదరి పెద్ద మొత్తంలో విరాళం ఇచ్చారని, అంతేకాకుండా, ఆయన ప్రకృతిపై అవగాహన కల్పిస్తూ, స్లోగన్లతో కూడిన ఫ్లకార్డులు తయారు చేయించి విద్యార్థులను ర్యాలీకి పంపించమన్నారని తెలుపుతూ, మంచి కార్యక్రమాలు చేపడుతున్నారని, విద్యార్థులకు వాటిపై అవగాహన వస్తుందని అనుమతించినట్లు తెలుపుతూ, తొమ్మిదో తరగతి విద్యార్థులను పంపించమని ఉపాధ్యాయులకు చెప్పి, అక్టోబర్ 5న తాను శెలవు పెట్టానని, విద్యార్థుల తో పాటు ర్యాలీ కి ఉపాధ్యాయుడిని పంపించామని, ఆయన క్షేమంగా పాఠశాల కు విద్యార్థులను చేర్చారని వివరణ ఇచ్చినట్లు తెలిపారు. పాఠశాలకు డొనేషన్స్ ఇస్తే ఎవరి అనుమతులు అవసరం లేదా.? పాఠశాల భవనానికి పెద్ద మొత్తంలో నిధులు అందించడం వలన విద్యార్థులను మానవతా సంస్థ నిర్వాహకులతో పంపించినట్లు వెల్లడించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి సునీత వివరణను గమనిస్తే.. విద్యార్థులను మండలం దాటి మరొక జిల్లా పరిధిలో ఉన్న వేరొక మండలం కు చెందిన పలు గ్రామాలకు సైకిల్ పై మండుటెండలో పంపే సమయంలో మండల విద్యాశాఖాధికారి వద్ద అనుమతి పొందియున్నరా.? విద్యార్థుల తల్లిదండ్రులకు విషయం తెలియచేసి వారి వద్ద నుండి అనుమతి పొందారా.? గతంలో పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి, పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తమ సొంత ఖర్చులతో 2018 నుండి ప్రతి సంవత్సరం ఆగష్టు 15 న బహుమతులు అందించి విద్యార్థులను ప్రోత్సహిస్తుండగా, 2025 ఆగష్టు 15 న అధికారుల అనుమతి లేదని, బహుమతులు అందించేందుకు అనుమతించమని చెప్పిన ప్రధాన ఉపాధ్యాయురాలు. ఎవరి వద్ద అనుమతులు పొంది విద్యార్థులను బయట వ్యక్తుల వెంట పంపించారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

> నేను శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నాను. నేను చదువుకున్న పాఠశాలలో విద్యార్థులను ప్రోత్సహించాలనే ఆలోచనతో 2018 నుండి పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నా సొంత ఖర్చులతో షీల్డ్, ఫ్రేమ్, మెమెంటోలు ఇస్తూ ప్రోత్సహించేవాడిని, కానీ గత ఆగస్టు 15 వ తేదీన నన్ను పాఠశాలలోనికి రానివ్వలేదు. అనుమతులు లేవని దూరం పెట్టారు. బహుమతి ఇవ్వడానికే అనుమతి లేనప్పుడు మానవతా సంస్థ నిర్వాహకులు విద్యార్థులను జిల్లాలు, మండలాలు దాటించి సైకిల్ యాత్ర చేయించారు అంటే అనుమతులు ఎలా ఇచ్చారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు సమాధానం చెప్పాలి.
>
> 
>
> **బక్కి సందీప్**
> **శ్రీ రామయ్య జిల్లా పరిషత్ హై స్కూల్, పూర్వ విద్యార్థి**



బహుమతులు అందిస్తున్న పూర్వం విద్యార్థి సందీప్

**ఉపాధ్యాయుని పర్యవేక్షణ నిజంగా ఉందా..?**

విద్యార్థుల వెంట తమ పాఠశాల నుండి వీరాంజనేయరెడ్డి అనే ఉపాధ్యాయుని పంపామని ప్రధానోపాధ్యాయురాలు వివరణ ప్రకారం ఆ ఉపాధ్యాయుడు సైకిల్ పై విద్యార్థులను పర్యవేక్షిస్తూ వెళ్ళారా.? అలా వెళితే తమకు ఎవరూ మార్గం చెప్పేవారు లేరని, ముందు వెళ్తున్న సైకిల్ ను అనుసరించి, వెనుక వెళ్ళే వాళ్ళమని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎందుకు చెప్పింది.? ఉపాధ్యాయుడు సైకిల్ ర్యాలీకి వెళ్లడం వాస్తవమే, కానీ ఆ ఉపాధ్యాయుడు విద్యార్థులను పట్టించుకోకుండా మానవతా సంస్థ నిర్వాహకుల వెంట ఉంటూ, ఫోటోలలో కనబడేందుకు ప్రయాసపడడంతో విద్యార్థులకు ప్రమాదకర రహదారులలో సరైన మార్గదర్శి లేరు అనేది ఒప్పుకోవాల్సిన వాస్తవం. విద్యార్థులకు అనుకోని ప్రమాదం సంభవించినట్లయితే దాని పర్యావసనానికి ఎవరు బాధ్యులు "పాఠశాల ఉపాధ్యాయులా ? లేక విశ్వ మానవతా సంస్థ నిర్వాహకులా ?"

**మండుటెండలో విద్యార్థులను వేధించినా, నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తున్న యంత్రాంగం ..**

సైకిల్ యాత్ర పేరుతో ప్రకృతిపై జాలి చూపించే, విశ్వ మానవతా సంస్థ నిర్వాహకులు విద్యార్థులపై మాత్రం కనికరం చూపలేకపోయారు. మండుటెండలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కించి, పక్కజిల్లా, వేరొక మండలంలోని వివిధ పాఠశాలలకు వారిని తిప్పి, త్రాగునీరు వసతులైనా, ఏర్పాటు చేయకుండా విద్యార్థులను వేధించడం తల్లిదండ్రులను తీవ్ర అగ్రహానికి గురిచేస్తుంది. కళ్ళు తిరిగి పడిపోయిన సి. హెచ్ కావ్య అనే విద్యార్థిని ని ఏ ఆసుపత్రికి తరలించారు.? ఆసుపత్రికి తరలించడం పక్కన పెడితే మానవత సంస్థ నిర్వాహకులు విద్యార్థినికి ఎలా ఉందో అని కనీసం పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వెంట వెళ్లిన ఉపాధ్యాయుడే విద్యార్థినిని వాళ్ళ ఇంటికి అప్పగించిన పరిస్థితి. మరొక వైపు మండుటెండలో విద్యార్థులను వేధించిన ఉపాధ్యాయుల వైఖరి పై విలేకరులు ప్రశ్నిస్తున్నారని, విద్యార్థులతో తల్లిదండ్రులే రాసినట్టు, తప్పుడు లేఖలు రాయించి, వారి తల్లిదండ్రుల సంతకాలను, వారి చేతే ఫోర్జరీ చేయించిన ఉపాధ్యాయుల చర్యలు మరింత అధ్వాన్నం. ఇంత జరిగినా తామేమీ ఎరుగనట్టు మండల విద్యాశాఖ అధికారులు వ్యవహరించడం విడ్డూరం. విద్యార్థులను వేధించిన మానవత సంస్థపై తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని డి.వై.ఈ.ఓ రామలక్ష్మణమూర్తి ని కోరగా.. సమాజ సేవ కొరకు వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసిన నన్నే ప్రశ్నిస్తారా..అని అన్నారని ఆ వివరణ పై తాము సంతృప్తిగా లేమని డివైఈవో చెప్పడం గమనార్హం.

**డొనేషన్స్ ఇస్తే విద్యార్థులను ప్రచారాలకు పంపిస్తారా.?**

ప్రధానోపాధ్యాయురాలు శాంతి సునీత ఇచ్చిన వివరణలో విరాళం అందించారు కనుక మంచివారని విద్యార్థులను పంపించామని చెప్పిన మాట ప్రకారం. పాఠశాలకు విరాళం ఇచ్చిన మరొక సంస్థకు చెందిన మంచివారు విద్యార్థులను తమ సంస్థ ప్రచార నిమిత్తం పంపమంటే పంపిస్తారా.? లేక మానవత సంస్థ నిర్వాహకులకే ప్రత్యేక ప్రచార వెసులుబాటు కల్పించారా.? ప్రచారానికి పంపడం నిజమైతే ఒక జీవోను అందించాలని పాఠశాల తీరును పలువురు ఎద్దేవా చేస్తున్నారు.

> విశ్వం వాయిస్ దిన పత్రికలో ప్రచురమైన మానవత్వం మరిచిన మానవతా తీరు అనే కథనం చూసి, తొమ్మిదో తరగతి చదువుతున్న మా అమ్మాయిని ప్రశ్నించాను. నిజమేనని తమను చాలా దూరం సైకిల్ యాత్ర చేయించారని, సరదాగా వెళ్ళామని కాని ఎండ తీవ్రత చాలా బాధపడ్డామని చెప్పడం నన్ను బాధించింది. కనీసం తాగునీరు అందించకుండా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులమైన మాకు కనీసం మాటైనా చెప్పకుండా మా పిల్లలతో మండుటెంలో సైకిల్ తొక్కించడం, మరల వారితో మేము రాసినట్లు లేఖలు రాయించడం ఎంతవరకు సమంజసం. అలాగే పాఠశాలలో తెలుగు బోధన సరిగా లేదు. పరీక్షలు రాయాల్సి ఉన్న మా అమ్మాయికి ఏమి చదవాలో తెలియడం లేదు. పరిస్థితులపై అధికారులు స్పందించాలి.
>
> 
>
> **నేకూరి నాని బాబు**
> **తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని తండ్రి**


# చేనేత-లేపాక్షి రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## బీసీ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి ఎస్.సవిత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో బీసీ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే దిశగా చర్యలు వేగవంతమవుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ,ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆదివారం స్థానిక ప్రవేటు సమావేశ మందిరంలో (షెల్టాన్ హోటల్) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బీసీ సంక్షేమ, చేనేత,జౌళి , లేపాక్షి శాఖ అధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సంక్షేమం, విద్యా వసతుల మెరుగుదల బీసీ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. "సామాజిక బాధ్యత కింద సిఎస్ఆర్ భాగస్వామ్యం ద్వారా బీసీ హాస్టల్స్ అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సదుపాయాలు నిరంతరంగా అందించాలి" అని సూచించారు. "దోమలు రాకుండా మెస్‌లను శుభ్రంగా నిర్వహించాలన్నారు. వేడి చల్లార్చిన నీరు, తాజాగా వండిన ఆహారం మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. విశ్రాంతి గదులు, తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయట ఆహారం తీసుకురావద్దని మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. బీసీ వర్గాల ఆర్థిక, సామాజిక, విద్యా స్థాయిని పెంచే దిశగా ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతుందని తెలిపారు. చేనేత, లేపాక్షి, అప్కో సంస్థల ద్వారా బీసీ వృత్తివర్గాలకు మార్కెట్ లింకులు కల్పించడం, విక్రయాలు పెంచడం, స్వయం ఉపాధికి ప్రోత్సాహం ఇవ్వడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని వివరించారు. బీసీ విద్యార్థుల విద్యా భవిష్యత్తు సుస్థిరం కావడానికి వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, ఆరోగ్యం, భద్రత, నాణ్యమైన విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. "ప్రతి వసతి గృహం, గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. విద్యార్థుల తల్లిదండ్రులు వారితో మాట్లాడేందుకు కాయిన్ ఫోన్ సౌకర్యం కూడా కల్పించామన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, వసతి గృహాల పరిశుభ్రతపై మాట్లాడుతూ "వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులను మన పిల్లలుగా భావించి, ప్రతి అధికారి బాధ్యతగా చూడాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తరచూ గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు, హాస్టల్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించాలనీ సూచించారు. వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి." "తల్లితండ్రులు ఎంతో విశ్వాసంతో పిల్లల్ని హాస్టల్స్‌కు పంపుతున్నారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మన బాధ్యత. పిల్లల విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. చేనేత, లేపాక్షి రంగాలపై మాట్లాడుతూ "ఆప్కో, లేపాక్షి విక్రయాలు పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆప్కోలో రెడీమేడ్ వస్త్రాలు కూడా అందుబాటులోకి తీసుకుని రావడం జరిగిందనీ, మేక్ ఇండియా - మేడ్ ఇండియా దిశగా స్వదేశీ ఉత్పత్తులను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళడం, అలవాటుగా మార్చుకోవడంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. నాణ్యమైన లేపాక్షి ఉత్పత్తులను పెద్ద ఎత్తున ప్రదర్శించి, ప్రచారం కల్పించాలన్నారు. హ్యాండ్లూమ్, టెక్స్టైల్ రంగాల్లో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను లబ్ధిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో పథకాల అమలులో మరింత వేగం అవసరం" అని తెలిపారు. ఆ క్రమంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో 16 అప్కో షాప్స్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆంధ్రప్రదేశ్ బీసీ కోఆపరేటివ్ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి బి. శశాంక, బీసీ కార్పొరేషన్ ఇ.డి. శ్రీనివాస్, ఆప్కో జీఎం కే. పెద్దిరాజు, ఏబీసీడబ్ల్యూఒ ముత్యాల సుబ్బారావు, లేపాక్షి అధికారులు, మూడు జిల్లాల ఇతర క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# నవ్యాంధ్ర అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రిగా ఆయన..




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** చంద్రయుగం 15 ఏళ్లూ ఓ స్వర్ణయుగం ...! ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దశ, దిశను మార్చిన ప్రజా ప్రస్థానం అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య శుభాకాంక్షలు తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ లో చంద్రోదయానికి.. అమావాస్య చీకట్లను చెరిపేసిన అభివృద్ధి పున్నమి ఆవిర్భావానికి 15 ఏళ్లు పూర్తయ్యింది. ఈ 15 ఏళ్ల కాలం ఆంధ్రప్రదేశ్ కు ఓ స్వర్ణ యుగం. రాష్ట్రం దశ దిశను మార్చిన విలువైన ప్రస్థానం.." అని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్, తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య కొనియాడారు. ముఖ్యమంత్రిగా 15 ఏళ్ళు పూర్తిచేసుకున్న చంద్రబాబుకు వారు శుభాకాంక్షలు తెలిపారు. "పూర్వ ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్ర అభివృద్ధి ప్రదాతగా ఈ 15 ఏళ్ల చంద్రబాబు పరిపాలనా ప్రస్థానం చిరస్మరణీయమని అన్నారు. సంక్షోభం నుంచి అవకాశాలను సృష్టించుకుని, తొలి అడుగులను వేయి అడుగుల ప్రయాణంగా మలుచుకున్న బహు దూరపు బాటసారి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. 1995, 1999,2014, 2024 లో నాలుగు సార్లు ఆయన చేసిన ప్రమాణం.. అభివృద్ధి పథంలో రాష్ట్ర ప్రయాణానికి ఓ నాందిగా నిలిచిందని అన్నారు. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబుది ఓ అరుదైన రికార్డు అని చెప్పారు. ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా సరే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ఆయన సంకల్పం మహా గొప్పదని కీర్తించారు. ఈ రాష్ట్ర ప్రజల మద్దతుతో చంద్రబాబు మరిన్ని సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగితే స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారం అవుతుందని సామాజిక మాధ్యమాల్లో తెలిపారు.






# డిబివి రాజు అపార్ట్మెంట్లో అనేక అవకతవకలు..

❋ అపార్ట్మెంట్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు.. ❋ అక్రమ నిర్మాణాలు చేపట్టి అద్దెలకు ఇచ్చి వ్యాపార సాగిస్తున్న దుస్థితి
❋ ఫ్లాట్ కొనుక్కున్న మాకు పార్కింగ్ లేదు , వసతులు శూన్యం.. ❋ కామన్ రోడ్ ఆక్రమించిన అపార్ట్మెంట్ వ్యాపార పార్కింగ్..
❋ అధికారులు పరిశీలించి అపార్ట్మెంట్లో నివసించే వారికి రక్షణ కల్పించాలి.







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరానికి కేంద్ర బిందువు అయిన పుష్కర ఘాట్లో వద్ద ఉన్న డిబివి రాజు అపార్ట్మెంట్లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు జరిగినట్లు అపార్ట్మెంట్లో నివసిస్తున్న బంటుపల్లి గణేష్ ఆరోపించారు. ఆదివారం డి.బి.వి రాజు అపార్ట్మెంట్లో విలేకరులతో మాట్లాడుతూ పుష్కర్ ఘాట్లో నిర్మించిన డిబివి రాజు అపార్ట్మెంట్లో అనేక అవకతవకలు జరుగుతు న్నాయని ఆరోపించారు. అపార్ట్మెంట్ నిర్మాణంకు మున్సిపల్ అధికారులు జి-ప్లస్ 4కు అనుమతులు ఇచ్చారని అయితే అపార్ట్మెంట్ యజమాని మున్సిపల్ శాఖ నుంచి ఏ విధమైన అనుమతులు లేకుండా 5,6 ఫ్లోర్లు నిర్మాణం చేసి వాటిని అద్దెకు ఇచ్చి వ్యాపారం చేస్తున్నారని వివరించారు. 6 ఫ్లోర్లు అపార్ట్మెంట్ నిర్మాణం జరిగినప్పటికీ ఏ విధమైన పార్కింగ్ స్థలం లేదని తెలిపారు. అపార్ట్మెంట్ వాసులు సొంత నిధులతో కొనుక్కున్న కారిడార్ కూడా ఆక్రమణ చేశారని ఆరోపించారు. అపార్ట్మెంట్ లోపలికి వచ్చేందుకు ఆరు డోర్లు ఉన్నాయని వాటి నుంచి రాత్రి సమయంలో అపరిచిత వ్యక్తులు కూడా అపార్ట్మెంట్లోకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి అపార్ట్మెంట్ వాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపార్ట్మెంట్ లోకి ప్రవేశించకుండా చుట్టూ కాంపౌండ్ వాళ్ళు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ అపార్ట్మెంట్ నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. డిబివి రాజు అపార్ట్మెంట్ వెనుక వైపు ఉన్న భవనానికి దారి లేదని ముందు ఉన్న భవనానికి సంబంధించిన స్థలాన్ని వెనకవైపు ఉన్న అపార్ట్మెంట్ లోపలికి వెళ్ళేందుకు ఉపయోగిస్తున్నారని అన్నారు. కారిడార్ కామన్ స్థలాన్ని కూడా ఆక్రమించి అపార్ట్మెంట్లో నివసిస్తున్న వారికి ఇబ్బందులు సృష్టిస్తున్నారని తెలిపారు. అపార్ట్మెంట్లో అగ్ని ప్రమాదం జరిగితే నివసించే వారు తప్పించుకునే వీలు కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అపార్ట్మెంట్ ను మున్సిపల్, ఫైర్ సేఫ్టీ అధికారులు పరిశీలించి అపార్ట్మెంట్ లో నివసించే వారికి రక్షణ కల్పించి తగిన సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.





# యువకులు క్రీడల్లో రాణించాలి

## మానసిక, శారీరక దృడత్వానికి క్రీడలు దోహద పడతాయి - వాలీబాల్ కోర్టును ప్రారంభించిన టీడీపీ నాయకులు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానసిక, శారీరక దృడత్వానికి క్రీడలు దోహద పడతాయని టీడీపీ యువనేత మునిని బాబురావు అన్నారు. ఆదివారం స్థానిక 9వ వార్డు వెంకటేశ్వర నగర్లో ఉన్న డెల్టా హాస్పిటల్ వెనుక వాలీబాల్ కోర్టును తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రారంభించారు. టీడీపీ యువనేత మునిని బాబురావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాలీబాల్ కోర్టు ను టీడీపీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నాయకులు ఉప్పులూరి జానకి రామయ్య, బుడ్డిగ రవి, నక్కా దేవీప్రసాద్, విశ్వనాథ రాజు, కందికొండ అనంత్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి యువనేత మునిని బాబురావు మాట్లాడుతూ యువత మొబైల్ లో గేమ్స్ కు అలవాటుపడి శారీరక, మానసిక దృఢత్వంపై దృష్టి పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆదేశాల మేరకు ఆయన స్వంత స్థలంలో యువతకు ఉపయోగపడేలా వాలీబాల్ కోర్టు ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సలహ మేరకు వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేశా న్నారు. ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకొని క్రీడలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శశికుమార్, దుర్గా ప్రసాద్, రాము, మురళీ కృష్ణ, సంగమేశ్వర రావు,నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

# దేవీచౌక్ అన్న సమారాధనలో ఆదిత్య వాలంటీర్లు సేవలు

## వీరి సేవలను ఆలయ కమిటీ ప్రశంసలు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక దేవిచౌక్ 92వ శరన్నవరాత్రి దసరా ఉత్సవాలు తదుపరి చేసిన అన్న సమారాధన సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలకు ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు విద్యార్థులు అందించిన స్వచ్ఛంద సేవలకు అద్భుతమైన ప్రశంసలు లభించినవి. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు బత్తుల రాజరాజేశ్వరరావు,అల్లక సత్యనారాయణ (కార్యదర్శి)ట్రెజరర్ బత్తుల ఈశ్వరరావు,రామం తదితర సభ్యులు, స్వచ్ఛంద సేవకుల సేవలను ప్రశంసిస్తూ, భక్తులకు వారు అందించిన సహాయం ఎంతో మెచ్చదగినదని, వృద్ధులకు భక్తులకు చంటి పిల్లలకు అందించిన సహకారం, తోడ్పాటు అనిర్వచనీయమైనదని పేర్కొన్నారు.గత 16 సంవత్సరాలుగా నిరంతరం ఈ ఉత్సవాల్లో తమ సేవలను అందిస్తూ, భక్తుల భద్రత, సక్రమ ఏర్పాట్లలో ఎన్నదగిన కృషి మరువలేనివని కొందరు భక్తులు మెచ్చుకున్నారు. ఆదిత్య స్వచ్ఛంద సేవకుల ఎనలేని కృషి చేస్తున్నారని, వారు కొనియాడారు. ఈ కార్యక్రమం ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారైన డాక్టర్ జి.వి.ఎస్ నాగేశ్వరరావు నేతృత్వంలో జరిగింది.ఈ కార్యక్రమానికి సహాయకు లుగా పోలుకొండ సాయి, ఆకుల శిరీష, బేటి విమల,డాక్టర్ బి.హెచ్. వి. రమాదేవి సహకరించారు. ఎన్ఎస్ఎస్ నాయకులు సూర్య, వినయ్, సందీప్, మౌనిష్, మనోజ్, సుమ, యశస్విని, జ్ఞానేశ్వరి, చరణ్మౌళి నాయకత్వంలో అద్భుతంగా సేవలు చేశారు. తమ ఆదిత్య వాలంటీర్ల స్వచ్ఛంద సేవలకు ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుగుణా రెడ్డి, ప్రిన్సిపాల్స్ సిహెచ్.ఫణి కుమార్, ఎస్కే రెహమాన్, ఎం.చంద్రశేఖర్ ఎం.చంద్రశేఖర్, డి.రామకృష్ణ, తదితరులు స్వచ్ఛంద సేవకులకు, ఎన్.ఎస్.ఎస్ అధికారులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

### హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా మీడియా కో-ఆర్డినేటర్గా

# అత్తులూరి కిషోర్ నియామకం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి తూర్పుగోదావరి జిల్లా విభాగం మీడియా కో-ఆర్డినేటర్ గా అత్తులూరి కిషోర్(ఏబీసీ ఛానల్ స్టాఫ్ రిపోర్టర్)ను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు రవికుమార్ వెల్లడించారు. తమ సమితికి సంబందించి జరిగే అన్నీ కార్యకలాపాలు మీడియా కు అందించి పరిరక్షణ సమితిని ప్రజలకు మరింత దగ్గర చేసే బాధ్యతను ఆయనకు అప్పగించినట్లు రవి కుమార్ ఓ ప్రకటనలో తెలియచేశారు.

# ఐద్వా మహాసభలు జయప్రదం చేయండి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 13,14,15వ తేదీలలో అనంతపురంలో జయప్రదం చేయాలని కోరుతూ రాజమండ్రిలో గోరక్షణపేట ఐద్వా మహిళా సంఘం నాయకురాలు కాశీ అన్నపూర్ణదేవి ఆధ్వర్యం లో సీనియర్ నాయకురాలు కామ్రేడ్ టి.సావిత్రి జెండా ఎగురవేశారు.ఈసందర్భంగా సావిత్రి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింస, దాడులు, అత్యాచారాలు అరికట్టాలని, చట్టసభల్లో మహిళ రిజర్వేషన్లు అమలు చేయాలని, మహిళల రక్షణకు ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని,మధ్య, బెల్టుషాపులు అరికట్టాలని, కూటమి ప్రభుత్వం సూపర్ 6 హామీలను అమలు చేయాలని, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ.1,500/- ఇవ్వాలని తదితర డిమాండ్లతో జరిగే మహా సభలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు, ఐద్వా నాయకులు అన్నపూర్ణ, స్రవంతి, లీల, పద్మ, కృష్ణవేణి, సునీత, సత్యవతి, గాయత్రి, రామలక్ష్మి, లోహిత, రమ్య, ఇషాఛన్విక తదితరులు పాల్గొన్నారు.

# సందేశాత్మక చిత్రాలు ప్రజలు ఆదరించాలి : గల్లా కేశవ



**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ పవన పుత్ర క్రియేషన్స్ బ్యానర్ పతాకం పై డైరెక్టర్ సురేష్ కొల్లాపు నిర్మిస్తున్న చిత్రం "సూరి "సినిమాకు ఫస్ట్ క్లాప్స్ ను కొవ్వూరులో ఆదివారం ఉదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథి రాష్ట్ర బిజెపి నాయకులు గెల్లా కేశవ కొట్టారు. దీనికి హీరో రావ్ మజ్జి, హీరోయిన్ పూజ, మెయిన్ లీడ్ గల్లా రాజేష్, సునీల్ కోడూరి,సుమ శ్రీ నటించగా డ్రాప్ వినయ్ తన్నేటి,ప్రొడక్షన్ డిజైనర్ ముప్పిడి అశోక్,నరేంద్ర ఏనుగుబల్లి ముఖ్య అతిధులుగా విచ్చేసారూ. ఈ చిత్రం ఉద్దేశించి గెల్లా కేశవ మాట్లాడుతూ సభ్య సమాజానికి గొప్ప మెసేజ్ ఇచ్చే చిత్రంగా తెలుగు ప్రేక్షకుల ఆదరించాలి,ప్రజల గుండెల్లో నిలిచిపోతుందని కుటుంబ సభ్యులు మొత్తం అందరు ఒకేసారి తిలకించే సినిమా అని ఆయన తెలిపారు.డైరెక్టర్ సురేష్ కొల్లాపు మాట్లాడుతూ సూరి కథ అన్నీ వర్గాలకు ఆకట్టుకుందని తెలిపారు.. ఈ చిత్రం 45 రోజుల్లో ప్రజల ముందుకు తీసుకొస్తామని అన్నారు.

# నేడే ఛలో రంపచోడవరం ఆదివాసీలారా తరలిరండి..

## ప్రత్యేక ఆదివాసీ డిఎస్సి సాధనకై హక్కులు,చట్టాలు సాధనకై శాంతియుత పోరాటాలకు సిద్ధం కావాలి ఏపీ ఆదివాసీ జేఏసీ పిలుపు



**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్యేక ఆదివాసీ డిఎస్సి ప్రకటించాలని, ఆదివాసీ హక్కులు,చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని అక్టోబర్ 13వ తేదీన ఛలో రంపచోడవరం ఐటీడీఏ కార్యక్రమానికి ఆదివాసులందరూ తరలిరావాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లంశేఖర్ పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు అరకులో ఆదివాసీ నిరుద్యోగులకు 100శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టీఏసీ) ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని,ప్రత్యేక ఆదివాసీ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలని, ఆదివాసీ హక్కులు,చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని అల్లూరి సీతారామ జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆదివాసీ నిరుద్యోగులు ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువతీ యువకులు, ఆదివాసీ సంఘాల నాయకులు పెసా కమిటీ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు,కార్యదర్శులు అందరూ పాల్గొని ఆదివాసులకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నిద్దాం అన్నారు. ముందుగా రంపచోడవరం ఐటీడీఏ నుండి శాంతియుతంగా ర్యాలీ జరుగుతుందన్నారు.

# పీఎంపీలకు బ్రెయిన్ స్ట్రోక్పై అవగాహన



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామాల్లో ప్రథమచికిత్సలు అందించే పీఎంపీలు బ్రెయిన్ స్ట్రోక్పై అవగాహన పొంది ఉండాలని స్థానిక నీలిమ న్యూరో హాస్పిటల్ కు చెందిన న్యూరో వైద్యనిపుణురాలు డాక్టర్ సాయి నీలిమ చల్లా అన్నారు.ఆదివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అఃడ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్)అధ్వర్యంలో హుక్కుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్ నందు మండల అధ్యక్షులు రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిధిగా రాజమండ్రి నీలిమ న్యూరో హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సాయి నీలిమ చల్లా విచ్చేసి మాట్లాడుతూ మెదడుకు రక్త సరఫరా నిలిచిపోవడం లేదా తగ్గడం వల్ల,మెదడు కణాలు దెబ్బతినడంతో బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని దీని వలన మెదడుకు రక్తం, ఆక్సిజన్, అందకపోవడంతో కణాలు చనిపోతాయని,ఫలితంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి శాస్వత వైకల్యం ఏర్పడవచ్చని దీనికి తక్షణమే తొలి నాలుగు గంటలలో అత్యవసర వైద్య సహాయం అందిస్తే రోగి పక్షవాతం బారిన పడకుండా కాపాడవచ్చని అన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక ఒత్తిడి, ధూమపానం, మద్యపానం బ్రెయిన్ స్ట్రోక్ కారణమని అన్నారు.బ్రెయిన్ స్ట్రోక్ను ఎలా గుర్తించాలో వివరించారు. డాక్టర్ క్రొవ్విడి రాజేష్ మాట్లాడుతూ మెదడుకు, వెన్నుపాముకు, నరాలకు సంబంధించిన రుగ్మతల గురించి పీఎంపీలకు చక్కటి అవగాహన కల్పించారు. రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యు.ప్రసాద్ బాబు, ఉపాధ్యక్షులు కేఎస్ఎస్ఎన్ రెడ్డి, సహాయ కార్యదర్శి సుంకర శ్రీనివాస్లతో పాటు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వైద్యులను సభ్యులు ఘనంగా సత్కరించారు.



# ప్రైవేట్ రంగంలో 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- కల్తీ మద్యం అమ్మకాలు అరికట్టాలి
- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉందుర్తి సుబ్బారావు డిమాండ్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం నుంచి సబ్సిడీలు, రాయితీలు పొందుతూ పరిశ్రమలు స్థాపిస్తున్న పరిశ్రమలు ప్రైవేట్ రంగంలో 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తూర్పుగోదావరి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉందుర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం విచ్చేసినట్లు తెలిపారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం ద్వారా భూములు, బ్యాంకు లోన్లు, ఇతర మౌలిక వసతులు పొంది పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమలలో స్థానికులకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ద్వారా పార్లమెంట్ లో చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు తీసుకు రాకపోవడం వలన యువతకు ఉపాధి లేక నిరుద్యోగులు పెరుగుతున్నారని వివరించారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలలో 100 కు 75 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. కల్తి మద్యం అమ్మకాలను అరికట్టాలని రిమాండ్ చేశారు. సెల్ఫీ మద్యం తాగి ప్రజలు కిడ్నీ లివర్ ఉదర సంబంధిత వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం అమ్మకాలు అరికట్టి, కల్తీ మద్యం అమ్మకాలు చేస్తున్న సంబంధిత వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉందుర్తి సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు రాష్ట్ర పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన తీర్మానాలు ఆమోదించినట్లు వివరించారు. వీటిలో ముఖ్యమైనవి ఎస్సీ వర్గీకరణ కు కేంద్ర, రాష్ట్రాలు అమలు చట్టబద్ధత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తీర్మానం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ఉద్యోగాలలో ఎస్సీ బి క్యాటగిరీకి చెందిన 1,633 మంది ఉద్యోగాలు పొందారని ప్రభుత్వ అమలు చేస్తున్న వర్గీకరణ విధానం పట్ల హర్షవర్తం చేస్తూ తీర్మానం చేశామన్నారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఇతర సంక్షేమ పథకాలకు దారి మళ్లించకుండా ఎస్సీల సంక్షేమానికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ బ్యాక్ లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఎస్సీలలో ఉన్న 59 ఒక్క కులాలకు ఉపయోగపడే విధంగా ఎస్సీ కార్పొరేషన్ నిధులు, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఆర్పీఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షులు తలారి నాని మాదిగ కోనసీమ జిల్లా అధ్యక్షులు కన్నిపాముల శ్రీనివాస్ మాదిగ, తూర్పుగోదావరి జిల్లా ఇన్చార్జి బొచ్చు చినబాబు మాదిగ, గుంటూరు జిల్లా ప్రతినిధులు కళ్యాణి జార్జి మాదిగ, కందుల జార్జ్ మాదిగ, వెంకట్ మాదిగ, రామచంద్రాపురం ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ దోమ్మలపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తుని జోన్ “ఆత్మ” కమిటీ వైస్ చైర్మన్‌గా


# కరణం సుబ్రహ్మణ్యం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని ప్రాంతం వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ” (అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ- “ఆత్మ”) కమిటీ వైస్ చైర్మనుగా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన కరణం సుబ్రహ్మణ్యం నియమితులు అయ్యారు. ఆత్మ ... వ్యవసాయం, పశుసంవర్ధకం, ఉద్యానవనం వంటి రంగాల్లో తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు బదిలీ చేయడానికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉండే స్వయంప్రతిపత్తి కలిగి జిల్లా స్థాయిలో నిర్వహించే కమిటీ. వ్యవసాయ శాఖ, దాని అనుబంధ విభాగాలు, పరిశోధనా సంస్థలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా వ్యవసాయ కార్యకలాపాలు, విస్తరణ కార్యక్రమాలను ఏకీకృతం చేయడంలో ఇది కీలక పాత్రను ఆత్మ పోషిస్తుంది. దీనికి అనుబంధంగా ఉన్న తుని ప్రాంతీయ కమిటీకి తాజాగా వైస్ చైర్మనుగా నియమితులైన కరణం సుబ్రహ్మణ్యం ఇప్పటికే కొన్ని ఏళ్లుగా రాజకీయంగా కూడా కాకినాడ జిల్లా జనసేన పార్టీ ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులుగా పార్టీకి సేవలను అందిస్తూ వస్తున్నారు. శ్రమించే స్వభావం, మంచి వ్యక్తిత్వం, సేవాభావం, పరోపకారియైన కరణం సుబ్రహ్మణ్యంకు ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ సిఫారసుతో ఈ తుని జోన్ “ఆత్మ” కమిటీ వైస్ ఛైర్మన్ నామినేటెడ్ పదవి లభించింది. రైతు సలహా కమిటీల ద్వారా రైతులకు ఫీడ్‌బ్యాక్ మెరుగు పరచడం, సాంకేతికత బదిలీలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం తదితర విషయాల్లో రైతులకు ఇటు ప్రభుత్వానికి అటు రైతులకు మధ్య వారధిగా సేవలందించేందుకు మనస్ఫూర్తిగా బాధ్యత వహిస్తూ నా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా “విశ్వం వాయిస్” కు కరణం సుబ్రహ్మణ్యం తెలిపారు. తనకు ఈ పదవిని కట్టబెట్టినందుకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్య కిరణ్ (బాబీ)కి కరణం సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలిపారు.

## సోమవారం యథాతథంగా పీజీఆర్ఎస్ కార్యక్రమం

### తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీజీఆర్ఎస్ కార్యక్రమం అక్టోబర్ 13వ తేదీ సోమవారం యథాతథంగా నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు జిల్లా కేంద్రానికి రాకుండా తమ డివిజన్, మండల కార్యాలయాలు, గ్రామ/వార్డు సచివాలయాల్లోనే అర్జీలు అందజేయ వచ్చని కలెక్టర్ సూచించారు. ఫిర్యాదుల సమర్పణకు 1100 టోల్‌ఫ్రీ నంబర్ లేదా meekosam.ap.gov.in వెబ్‌సైట్ ఉపయోగించ వచ్చని ఆమె తెలిపారు. అదేవిధంగా ఫిర్యాదు పరిష్కార స్థితి తెలుసు కోవడానికి 1100 (డబుల్ వన్ డబుల్ జీరో) నంబర్‌కు కాల్ చేయవచ్చని, అలాగే ప్రభుత్వ పౌర సేవల కోసం 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ ను వినియోగించు కోవాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు.

## రూ.3.49 కోట్లతో 3,500 ఎకరాలకు

# సాగునీరు అందిస్తాం..

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**జగ్గంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలో రూ.3.49 కోట్లతో జ్యోతుల పాపారావు నీటిపారుదల ప్రాజెక్టు శంకుస్థాపన చేయడం జరిగిందని తద్వారా 3,500 ఎకరాలకు ఆయకట్టు సాగు భూముల స్థిరీకరణ జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం లోని పురుషోత్తం పట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం స్టేజ్ 2 పవర్ ప్రెషర్ మెయిన్ ద్వారా మామిడాడ ట్యాంకు నీటి సరఫరా చేసేందుకు జ్యోతుల పాపారావు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పథకం నిర్మాణానికి ఆయన ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ రైతు సభను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. ఈ పథకం ద్వారా మామిడాడకు చేరే ఈ నీరు కేవలం ఒక మామిడాడ చెరువుకి పరిమితం కాకుండా దాని నుండి అనుసంధానమై ఉన్న కస్కేడ్ సిస్టం ద్వారా సీతారాముడు చెరువు, జగ్గవాని చెరువు, అచ్చన్న చెరువు వంటి కీలకమైన చెరువులన్నిటిని నింపుతూ ఫలితంగా సుమారు 3,500 ఎకరాలకు శివారు ప్రాంత భూములకు నీరు అందించేందుకు ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ఉపయోగ పడుతుందని ఆయన తెలిపారు. ఈ జ్యోతుల పాపారావు నీటిపారుదల పథకం మంజూరీకి జ్యోతుల నెహ్రూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ప్రత్యేకంగా విన్నవించారు. దానిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించిన వెంటనే ఈ పథకంకు అనుమతి మంజూరైందని ఆయన తెలిపారు. తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు రూ. 54 కోట్లతో క్యాబినెట్లో ఆమోదం పొందిందని, త్వరలోనే టెండర్లను పిలిచి పనులు చేపడ తామని ఆయన అన్నారు. తాళ్లూరు లిఫ్ట్ బాగు చేసి 30,000 ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని ఆయన అన్నారు. శిథిలమైన కాలవల మరమ్మ తులకు రూ. 5 కోట్లను ఆపరేషన్ మేనేజ్మెంట్ కింద మంజూరు చేసి టెండర్లు పిలిచి పనులను పూర్తి చేస్తాం తెలిపారు. ఏఅధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలోనే అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడతాం అన్నారు. రాష్ట్రంలో 1,040 లిఫ్ట్ ఇరిగేషన్లు ఉంటే అందులో 240 లిఫ్ట్ ఇరిగేషన్లు మాత్రమే పనిచేస్తున్నా యని, వీటి మరమ్మతులకు రూ. 840 కోట్ల అవసరమని వెల్లడించారు. వీటికి టెండర్లు పిలవడంతో పాటు 10 సంవత్సరాల పాటు ప్రభుత్వమే వీటిని నిర్వహణా బాధ్యతను ప్రభుత్వమే వహిస్తుందని ఆయన తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు రూ. 350 కోట్లను, అలాగే ప్రమాద స్థాయిలో ఉన్న ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల మరమ్మతులకు రూ.250 కోట్లను మంజూరు చేసామని తెలిపారు. రూ. 350 కోట్లతో హంద్రీనీవా ప్రాజెక్టు, రూ. 1,200 కోట్లతో పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులు పనులు చేపట్టామని, పోలవరం ప్రాజెక్ట్ 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. ఈ ప్రభుత్వం సాగునీటి పథకాలకు ప్రాధాన్యత ఇచ్చి పనులు చేపడుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గతంలో ఈ ప్రాంతానికి నాలుగు పథకాలు తెచ్చుకుంటే అందులో జ్యోతుల పాపారావు నీటిపారుదల ప్రాజెక్టు ఐదవదని, దీని ద్వారా జగ్గంపేట నియోజకవర్గంలోని శివారు భూములకు నీరు చేరుతుందని, తద్వారా రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని సభాధ్యక్షులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. అలాగే తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషనుకు రూ. 54 కోట్లను ప్రభుత్వం మంజూరి చేసిందని, జగ్గంపేట నియోజకవర్గంకు ఈ ప్రభుత్వంలో ఒక ప్రత్యేక ప్రాధాన్యత లభించిందని నెహ్రూ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్, ఇరిగేషన్ శాఖ సిఇ. కె.నరసింహ మూర్తి, ఎస్ఈ. డి.ఏసుబాబు, ఇఇ. డి.శ్రీనివాసులు, డిఇ. విప్రసాదరావు, జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ బాబు, పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, సూరంపాలెం ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఉంగరాల రాము, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, మండల పార్టీ అధ్యక్షులు జీనుమణిబాబు, ఎంపీపీ తోట రవి, పవర్ సొల్యూషన్స్ కాంట్రాక్టర్ విశ్వనాథం, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ‘రంగరాయ’లో అసంపూర్తిగా ఉన్న

# గర్ల్స్ హాస్టల్‌ను పూర్తి చేసేందుకు చర్యలు

### కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హామీ



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ప్రఖ్యాత మెడికల్ కాలేజ్‌గా ప్రసిద్ధి చెందిన రంగరాయ మెడికల్ కాలేజ్‌లో అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఆదివారం ‘రంగరాయ’ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు డా. ఆనంద్, డాక్టర్ వాడ్రేవు రవి తదితరులు క్యాంపు కార్యాలయంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌తో భేటీ అయ్యి గర్ల్స్ హాస్టల్ దుస్థితిని వివరించారు, సౌకర్యాలు లేమి, శిథిలావస్థకు చేరిన గర్ల్స్ హాస్టల్ భవనాలను పరిశీలించి, నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిపోయిన హాస్టల్ భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అప్పటికప్పుడు పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులతో కలిసి గర్ల్స్ హాస్టల్ భవనాలను పరిశీలించారు, అలాగే అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన హాస్టల్ భవనాలను పరిశీలించి, గుత్తెదారులతో చర్చించారు. గత ప్రభుత్వం హయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయని ఎంపీ ఉదయ్ ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న జి ప్లస్ 4 గర్ల్స్ హాస్టల్ తో పాటు జి ప్లస్ 3 బాయ్స్ హాస్టల్ లను పూర్తి చేసేందుకు సుమారు 35 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేయగా, ఏపీఎంఐడిసి తో పాటు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాబట్టేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ ఉదయ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. అనంతరం అయన గర్ల్స్ హాస్టల్లో విద్యార్థినిలతో భేటీ అయ్యి హాస్టల్లో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు, అలాగే ఏ సమస్య వచ్చినా ఒక సోదరుడిగా మీకు అండగా ఉండడంతో పాటు, కూటమి ప్రభుత్వ హయాంలోనే హాస్టల్ భవనాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, రామ్ కోశా అధ్యక్షులు డా. ఆనంద్, డా. వాడ్రెవు రవి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జీఎస్టీ 2.0పై వినియోగదారులకు ప్రదర్శన

### కొకనాడ షాపింగ్ సంబరాలు ప్రారంభం : జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జీఎస్టీ 2.0 ధరల తగ్గింపుపై వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పించే లక్ష్యంతో నేటి నుంచి ఎనిమిది రోజుల పాటు కొకనాడ షాపింగ్ సంబరాలను నిర్వహిస్తూ ఉన్నామని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కల్గించే విధంగా జీఎస్టీ శ్లాబులపై సంపూర్ణ అవగాహన కలిగించే లక్ష్యంతో సోమవారం నుంచి 19వ తేదీ వరకు కోకనాడ షాపింగ్ సంబరాలు నిర్వహిస్తా మన్నారు. కాకినాడ దేవాలయం రోడ్డులో పైడా చలమయ్య కళ్యాణమండపంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 09 గంటల వరకు ఈ ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ ఎగ్జిబిషన్లో హొమ్ అప్లయన్స్, సిమెంట్ డీలర్స్, స్పోర్ట్స్ ఎక్విప్మెంట్, మెట్రాస్, జిమ్, ఫిట్నెస్, బుక్స్ స్టేషనరీ, హొటల్స్, సోలార్ ప్యానల్స్ హ్యాండ్లూమ్ వీవర్స్, హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్, కెమిస్ట్ డ్రగ్గిస్ట్, ఫార్మింగ్ ఎక్విప్మెంట్, పెస్టిసైడ్స్, మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్స్ కు సంబంధించిన అన్ని రకాల ఎలక్ట్రానిక్ వస్తువులు, కిచెన్, మైక్రో ఇరిగేషన్, చేనేత, లైఫ్ ఇన్సూరెన్స్, గృహ ఉపకరణాలు, సోలార్ ప్యానల్స్ వంటి ఇతర అంశాలకు సంబంధించిన వివిధ వస్తువులను ప్రదర్శిస్తా మన్నరు. కాకినాడ జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ షాపింగ్ సంబరాల్లో జిల్లా వాసులు కుటుంబ సమేతంగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# స్వామివారిని దర్శించి పులకించిన భక్తజనం

## 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమద్వాహనంపై కోదండ రాముడిగా దర్శనమిచ్చిన శ్రీనివాసుడు





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న13 వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజయిన ఆదివారం స్వామివారు వాహన సేవలో భాగంగా హనుమద్వాహనంపై కోదండ రాముడిగా దర్శనమిస్తూ తిరుమాడ వీధుల్లో ఊరేగారు. ఉదయం విష్వక్సేన పూజతో ప్రారంభమైన కార్యక్రమాలు పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన, మహా స్నపనము, ప్రధాన హోమములు జరిగాయి. ఋత్వికులు దుష్టగ్రహ పరిహారార్థం మహా సుదర్శన హోమము నిర్వహించారు. అనంతరం తోమాల సేవ నిర్వహించి నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిపారు. సాయంత్రం స్వస్తి వచనము,ప్రధాన హోమములు,స్వామి వారికి విశేషార్చన,చతుర్వేద స్వస్తి,దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు, తీర్థ ప్రసాద వితరణ జరిపారు.రాత్రి కోదండ రాముని అలంకరణలో హనుమద్వాహనంపై ఊరేగారు. దాస్య భక్తికి ప్రతీకైనా హనుమంత వాహనంపై కోదండ రాముని రూపంలో శ్రీనివాసుని దర్శించడానికి భక్త జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. వాడపల్లి పురవీధులన్నీ గోవింద నామస్మరణతో మారుమ్రోగాయి. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు ఈ కార్యక్రమం నల్లం చక్రధరరావు ఆలయ చైర్మన్ సిబ్బంది పర్యవేక్షించారు.

# మాట నిలబెట్టుకున్న డేగల నాగేంద్ర

## అగ్నిప్రమాద బాధితులకు సొంత నిధులతో ఇల్లు నిర్మాణం - 15 రోజుల్లోనే పూర్తి చేసి దళిత కుటుంబానికి అందజేత - నాగేంద్రకు అభినందనల వెల్లువ



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** డేగల నాగేంద్ర ఫౌండేషన్ చైర్మన్ డేగల నాగేంద్ర అగ్ని ప్రమాద బాధితులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డ కుటుంబానికి అండగా నిలిచారు. సొంత నిధులతో ఆ నిరుపేద దళిత కుటుంబానికి 15 రోజుల్లో అన్ని హంగులతో చక్కటి ఇంటిని నిర్మించి ఇచ్చారు. వివరాల్లోకి వెళితే కాజులూరు మండలం ఆర్యవటం గ్రామం ఎస్సీ పేటలో కుందాల భవాని, లోవేశ్వరరావు అనే దళిత కుంటుంబానికి చెందిన నివాసం ఇటీవల అగ్నిప్రమదానికి గురై ఇల్లంతా కాలి బూడిదయింది. ఈ సంఘటనతో ఇంట్లోని సామాన్లు, బట్టలు సహా సర్వం అగ్నికి అహుతవ్వడంతో ఆకుటుంభం కట్టు బట్టలతో రోడ్డున పడింది. భార్యా, భర్తతో పాటు ముగ్గురు చిన్న పిల్లలతో ఎక్కడా తలదాచుకునే అవకాశం లేక.. ఎండకి ఎండుతూ, వానకు తడుస్తూ చిన్న గుడారంలో తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ఆర్యవటం గ్రామ దళిత నాయకుల విజ్ఞప్తి మేరకు స్థానిక గ్రామానికి చెందిన బాబీ ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు సిహెచ్ వివి సత్యనారాయణ(బాబీ) డేగల నాగేంద్ర ఫౌండేషన్(%ణచీఖీ%) చైర్మన్ డేగల నాగేంద్రని సహాయం కోరడం జరిగింది. బాబీ ద్వారా సమస్య విని చలించిన డేగల నాగేంద్ర ముగ్గురు చిన్న పిల్లలతో రోడ్డు పాలైన కుండల భవాని, లోవేశ్వరరావుల కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అంతే కాకుండా ఆకుటుంబానికి ఉండడానికి ఇల్లు నిర్మించి ఇస్తానని మాట ఇచ్చారు. ఈమేరకు గత నెల సెప్టెంబర్ 17వ తేదీన స్వయంగా నాగేంద్ర తల్లితండ్రులు, బంధనపూడిగ్రామ సర్పంచ్ డేగల తిరుమలవేణి, సత్యనారాయణ(అబ్బు) దంపతుల చేతుల మీదుగా శాస్త్రోక్తంగా భూమిపూజ చేసి ఇంటిపని ప్రారంభించారు. ఆ సందర్భంలో %ణచీఖీ% చైర్మన్ డేగల నాగేంద్ర మాట్లాడుతూ 15నుండి 20 రోజులలోపు ఇంటి నిర్మాణం పూర్తి చేసి నిరుపేద దళిత కుటుంబానికి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 15 రోజుల్లోనే యుద్ధప్రతి పదికన ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. రెండు గదులతో చక్కటి ఇంటిని నిర్మించారు. ఫ్లోర్ కి ఆకర్షనీయమైన టైల్స్ వేయడమే కాకుండా చక్కటి సీలింగ్, వాల్ కేర్ తో పాటు మంచి రంగులు వేయించి ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం స్థానిక దళిత నాయకులు, గ్రామ పెద్దల సమక్షంలో డిఎన్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు డేగల నాగేంద్ర సొంత నిధులతో నిర్మించిన కొత్త ఇంటిని అట్టహసంగా ప్రారంభోత్సవం చేసి నిరుపేద దళిత కుటుంబానికి అందజేశారు. దంపతులకు కొత్త బట్టలు అందజేసి ఆశీర్వదించారు. అంతకు ముందు నాగేంద్రకు తీన్మార్ డప్పులతో ఘనస్వాగతం పలికారు. స్థానిక నాయకులు, పెద్దలు ఆయన్ని ఘనంగా సన్మానించారు. గృహ ప్రవేశం అనంతరం డిఎన్ఎఫ్ చైర్మన్ డేగల నాగేంద్ర మాట్లాడుతూ నిరుపేదలకు సాయం చేయడమే కాకుండా కష్టాల్లో ఉన్నవారికి అండగా ఉండడమే డిఎన్ఎఫ్ ధ్యేయమని పేర్కొన్నారు. ఒక పేద దళిత కుటుంబానికి అండగా నిలవడం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. అనంతరం కొత్త ఇంట్లో గృహ ప్రవేశం చేసిన కుందాల భవాని దంపతులు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన తమ కుటుంబానికి కలలో కూడా ఊహించని విధంగా సొంత నిధులతో ఇంటిని నిర్మించి ఇచ్చిన డేగల నాగేంద్ర గారికి, వారి కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. డిఎన్ఎఫ్ ఫౌండేషన్ ద్వారా ఈ నిర్మాణం జరగడానికి కారకులైన బాబీ ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు చందాల బాబీకి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన స్థానిక దళిత నాయకులు మాజీ ఎంపీటీసీ రాగం పోలరాజు, పీతల రాజేష్, పిట్టా ధర్మయ్య, చిన్న, పి సత్యనారాయణ తదితరులకు భవాని దంపతులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూదికొండ రాముడు, యరకం నాగేశ్వరావు, జనసేన నాయకులు వనుం ఈశ్వరరావు, తోట కృష్ణ, చందాల రాంబాబు, బొక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భట్నవిల్లిలో గ్రామ కమిటీ ఏర్పాటు




**అమలాపురల్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం భట్నవిల్లి గ్రామంలో గ్రామ కమిటి అధ్యక్షుడు మండలిక సుబ్రహ్మణ్యం శర్మ ప్రధాన కార్యదర్శి నామాడి తారక్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయటం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత నియోజక వర్గానికి ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడం అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. అలాగే ఇందిరమ్మ కాలానికి సంబంధించిన పట్టాలు కూడా త్వరలోనే ఇప్పిస్తామని, గత ప్రభుత్వంలో చాలా మందికి ఇళ్ల స్థలములు ప్రక్క ఊరులో ఇచ్చిన కారణంగా వారు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని అని ఆ సమస్యను గ్రామ కమిటీ ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యలు అన్ని ఎమ్మెల్యే దృష్టిలో పెట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎవరికైతే ఇళ్ల స్థలములులేవో అర్హులైన వారికి ఇళ్ల స్థలములు ఇప్పిస్తామని,అర్హులైన వారు ఎవరు ఉన్నారో వారందరికీ త్వరలోనే పెన్షన్లు ఇప్పిస్తామని వారికి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐ టీడీపీ కార్యదర్శి కాట్రు శ్రీనుబాబు, ర్యాలీలోవరాజు, సరిపల్లి సుబ్బరాజు, బులుసు వి ఎస్ శర్మ, కాట్రు శ్రీనివాస్, మెట్టి ప్రసాద్, పందు సత్యనారాయణ, నేదునూరి బాలయ్య,దునబోయినా ప్రసాద్, పుణ్యమంతుల రమేష్, బొక్క శివన్నారాయ, దాకారపు బాలాజీ,కటికిదల వెంకట్రావు, దాకారపు సుందరావు, గిడ్ల చంటి, పెంట సుబ్రహ్మణ్యం, తోత్తరముడి సత్యనారాయణ, నామాడి శివ ప్రసాద్, కాట్రు వెంకటేశ్వరావు, మల్లవరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు

### నకిలీ మద్యం విక్రయాలను

# వ్యతిరేకిస్తూ నేడు ఆందోళన

## వైఎస్సార్ పార్టీ వర్గాలకు ఎమ్మెల్సీ తోట పిలుపు



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నకిలీ మద్యం విక్రయాలను వ్యతిరేకిస్తూ సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. నేడు తలపెట్టిన ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కూటమి పాలనలో నకిలీ మద్యం తయారీ, విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ అక్రమ మద్యం విక్రయాలను నిరసిస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు మండపేట విజయలక్ష్మి నగర్‌లోని వైసీపీ కార్యాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమై, అక్కడి నుంచి ర్యాలీగా ఎమ్మార్వో ఆఫీస్ కి వెళ్లి నిరసన తెలియజేస్తారని తెలిపారు.

# చిన్నారికి అండగా నిలిచిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కె. గంగవరం అక్టోబర్ 12 :- వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఒక వ్యక్తికి,మరో చిన్నారికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అండగా నిలిచి ఇరువురికి రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించి ఆపన్న ఆస్తం అందించారు. వివరాల్లోకెళితే రామచంద్రపురం మండలం వెల్ల సావరం గ్రామానికి చెందిన నందికొల్ల దుర్గాదేవికు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు,అలాగే కె.గంగవరం మండలం అద్దంపల్లి గ్రామానికి చెందిన రుద్రాక్షల వీరబాబు గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. వీరబాబు మెరుగైన ఆరోగ్య చికిత్స నిమిత్తం రూ.20 వేలు చెక్కును ఆర్థిక సహాయంగా అందించారు. కష్టకాలంలో ఉన్న తమ కుటుంబాలకు ఆసరాగా నిలిచిన మంత్రి సుభాష్ కు ఇరు కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సేవా నిరతకి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ నాయకులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బాలల హక్కులపై రచించిన "కొత్త ఉదయం" పుస్తక ఆవిష్కరణ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన న్యాయవాది శ్రీపావని బాలల హక్కుల పై రచించిన "కొత్త ఉదయం" అనే పుస్తకాన్ని రాష్ట్ర శాసన సభడిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు భీమవరంలోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. బాలల హక్కులపై వ్రాయబడిన పుస్తకాన్ని చూసి ఆయన శ్రీపావని ని ప్రశంశించారు. బాలల హక్కులపై అవగాహన కోసం విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఈ పుస్తకాన్ని ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు రచయిత్రి శ్రీపావని తెలిపారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన జిల్లా బిజెపి నాయకులు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరం శివారులో శ్రీ గణపతి ఫైర్ వర్క్స్ బాణాసంచా కర్మాగారంలో బుధవారం జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో మరణించిన రాయవరం మండలం, సోమేశ్వరం గ్రామానికీ చెందిన పాకా అరుణ,వాసంశెట్టి విజయలక్ష్మి ల కుటుంబాలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పరామర్శించారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయసహకారాలు అందేలా చూస్తామని హామీనిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రమాదం జరిగిన శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణాసంచా కర్మాగారంలోని ఘటన స్థలాన్ని సందర్శించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు చాట్రాతి జానకి రాంబాబు, కొత్తపల్లి శ్రీదేవి, మండపేట నియోజకవర్గ కన్వీనర్ కె వి వి సాయిరాం, బిజెపి రాయవరం మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్, పి.గన్నవరం నియోజవర్గ కన్వీనర్ చీకురుమల్లి వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు చీరట్ల సుబ్బారావు, నరాల రాంబాబు, చింతా తమ్మిరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, శాకా ధనంజయ, తదితరులు హాజరయ్యారు.

# అగ్నిప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు మృతి

## చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన చిట్టూరి యామిని, లింగం వెంకట కృష్ణ





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలో ఇటీవల బాణాసంచా కర్మాగారంలో జరిగిన విస్ఫోటనం లో మృతుల సంఖ్య పదికి చేరింది. సంఘటన లో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్యం పొందుతున్న తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం,అనపర్తి సావరం కి చెందిన చిట్టూరి యామిని, కాకినాడ జిల్లా, పెదపూడి మండలం, వేంద్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ (చినబాబు) లు చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ప్రమాద తీవ్రత తో ఘటనా స్థలంలోనే బాణాసంచా కర్మాగార నిర్వాహకునితో కలిపి ఆరుగురు సజీవదహనం కాగా, గాయపడిన నలుగురు ఆసుపత్రి లో చికిత్స పొందుతూ మృతి చెందడం ఆవేదన కలిగించే విషయం. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఏ విధంగా ఆదుకుంటుందోనని మండలంలోని పలువురు చర్చించుకుంటున్నారు.

# గంధం ఆ చర్మ సమస్యలకు వరం..



ఆయుర్వేదంలో గంధాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. మొఖంపై మొటిమలను నివారించడానికి, తళతళ మెరిసేందుకు గంధాన్ని ఉపయోగిస్తారు. గంధం పొడి, పేస్ట్ లేదా నూనె రూపంలో ఉపయోగించవచ్చు. ఈ ప్రకృతి సహజసిద్ధమైన పదార్ధం చర్మాన్ని సంరక్షించి మెరిసేలా చేస్తుందని నిపుణులు అంటుంటారు. ఈ గంధం ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మొటిమలను దూరం చేస్తుంది: గంధం చర్మ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. చర్మాన్ని అలర్జీల నుంచి రక్షించి మొటిమలను దూరం చేస్తుంది. ఒక టీస్పూన్ గంధం నూనె, చిటికెడు పసుపు, కర్పూరం కలిపి ముఖానికి ప్యాక్ లాగా రాసుకోవాలి. రాత్రాంత అలాగే ఉంచి ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేస్తే మొటిమలు, నల్లమచ్చలు పోతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది: తేలికపాటి ఎక్స్‌ఫోలియేటింగ్ లక్షణాల వల్ల చందనం.. చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. ఇది మీ చర్మంపై నల్ల మచ్చలను పోగొట్టడానికి సహాయపడుతుంది. టాన్ తొలగించడానికి ఇది సమర్థవంతమైనది. ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ గంధం పొడి, కొబ్బరి నూనె కలపాలి. దీన్ని ముఖానికి పూసుకుని.. మసాజ్ చేసి రాత్రంతా అలాగే ఉంచాలి. డార్క్ స్పాట్స్ వదిలించుకోవడానికి, రెగ్యులర్ టాన్ పొందడానికి దీన్ని రెగ్యులర్‌గా ఉపయోగిస్తే మచ్చలు పోయి.. ముఖం తళతళ మెరుస్తుంది. వృద్ధాప్యానికి చెక్: గంధపు చెక్కలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాన్ని ఎదుర్కోవడంలో సహాయపడతాయి. ఇది చర్మ ముడుతలను నివారించి వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. దీంతోపాటు చర్మాన్ని కాంతివంతంగా యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. దీని కోసం, 2 టేబుల్ స్పూన్ల ముల్తానీ మట్టి, 2 టేబుల్ స్పూన్ల గంధం కలపి రాయాలి. 15-20 నిమిషాలు అలాగే ఉంచి నీటితో కడిగితే చాలు. పొడి చర్మం నివారణ: చాలా మంది పొడి, నిర్జీవమైన చర్మంతో బాధపడుతుంటారు. అలాంటివారు చందనం ఫేస్ ప్యాక్ వేసుకోవడం వల్ల పొడి, నిర్జీవమైన చర్మానికి చెక్ పెట్టవచ్చు. ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ పాలపొడి, కొన్ని చుక్కల గంధం నూనె, రోజ్ వాటర్ కలిపి ముఖానికి రాయాలి. 15 నిమిషాలు ఉంచి నీటితో కడిగితే చర్మం నిగారింపుగా మారుతుంది. జిడ్డుగల చర్మం: జిడ్డుగల చర్మంపై తరచుగా ధుమ్మ, ధూళి పేరుకుపోతుంది. అలాంటివారికి చందనం దివ్య ఔషధంలా పనిచేస్తుంది. ఒక గిన్నెలో అర టీస్పూన్ గంధం పొడి, కొంచెం టమోటా రసం, అర టీస్పూన్ ముల్తానీ మట్టి వేసి బాగా కలపాలి. ఈ పేస్ట్‌ని ముఖంపై పూసుకొని..15 నిమిషాల తర్వాత క్లీన్ చేసుకోవాలి. ఇలా చేస్తే చర్మం మెరుస్తూ ఉంటుంది.

# పాదాల తిమ్మిర్లు ఉంటే అనారోగ్యానికి సంకేతం



పాదాల వాపులు వస్తున్నాయంటే తప్పనిసరిగా జాగ్రత్తపడాల్సి ఉంటుంది. నిజానికి చాలా మంది ఈ లక్షణాలను పెద్దగా పట్టించుకోరు. వాపులు, తిమ్మిర్లు తగ్గడానికి తాత్కాలికంగా మందులు వేసుకుని అక్కడితో వదిలేస్తారు. కానీ ఈ చిన్న సమస్యలే చాలా పెద్ద ముప్పుగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే..వీలైనంత త్వరగా స్పందించాలి. మరి ఇలా పాదాల్లో జరిగే మార్పులు ఏయే రోగాలకు సంకేతాలు.

పాదాల ఆరోగ్యాన్ని చాలా మంది పట్టించుకోరు. నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఇవే క్రమంగా పెద్దవై ముప్పు తెచ్చి పెడతాయి. చర్మం రంగు మారడం నుంచి తిమ్మిర్లు ఎక్కడం వరకూ ఎన్నో రకాలుగా సమస్యలు వస్తాయి. నడిచేటప్పుడు కూడా ఈ మార్పులు స్పష్టంగా కనబడతాయి. అలాంటప్పుడే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించడం మంచిది. ఏ మాత్రం ఆలస్యం చేసినా కండీషన్ సీరియస్ అయ్యే ముప్పు ఉంటుంది. నిజానికి పాదాల్లో ఇలాంటి మార్పులు వస్తున్నాయంటే ఎన్నో తీవ్ర అనారోగ్యాలకు ఇవి సంకేతాలు కావచ్చు అని పలు అధ్యయనాలు తేల్చి చెబుతున్నాయి. ముఖ్యంగా డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధుల లక్షణాలు ఇదే విధంగా ఉంటాయి. పాదాల్లో మంట, కురుపులు రావడం లాంటి లక్షణాలు రక్త సరఫరా సరిగ్గా లేనప్పుడు కనబడతాయి. ముఖ్యంగా నరాలు డ్యామేజ్ అయినప్పుడు కూడా పాదాల్లో ఇలాంటి మార్పులు కనిపించే అవకాశాలున్నాయి. ఇలాంటప్పుడు గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

పాదాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పులు వచ్చినప్పుడు కూడా రంగు మారేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వాపులను మాత్రం తప్పనిసరిగా గమనించాలి. ధమనుల్లో కొవ్వు పేరుకుపోయినప్పుడు, వీటి ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు ఇలా పాదాల్లో వాపులు వస్తాయి. సరైన సమయానికి సరైన వైద్యం అందించకపోతే తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. తరచూ తిమ్మిరిగా ఉండడం, దురద లాంటి లక్షణాలు కనిపించాయంటే అది డయాబెటిస్ లక్షణం కావచ్చు. లేదా నరం డ్యామేజ్ అయినప్పుడు కూడా ఇలాంటి లక్షణాలే కనిపిస్తాయి. బ్లడ్ షుగర్ లెవెల్స్ అసలు కంట్రోల్ లో లేనప్పుడు ఇలా జరుగుతుంది. నరాలు ఒత్తిడికి గురైనప్పుడు లేదా ఇంకేదైనా న్యూరో సమస్యలు తలెత్తినప్పుడు ఇలా పాదాల్లో తిమ్మిర్లు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే..ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు చాలా త్వరగా స్పందించాల్సి ఉంటుంది. లేదంటే ఈ సమస్య కాస్త తీవ్ర ఇన్ఫెక్షన్ కి దారి తీసే ప్రమాదం ఉంది. పాదాల్లో విపరీతమైన నొప్పి, వాపులు వస్తుంటాయి. పాదాలు చాలా బరువెక్కినట్టుగా అనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపించాయంటే గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్టు లెక్క. దీన్నే ఎడిమా అంటారు. ముఖ్యంగా హార్ట్ ఫెయిల్యూర్ కండీషన్స్ లో ఈ సమస్య తలెత్తుతుంది. గుండె కండరాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నా ఇలాగే పాదాల్లో వాపులు కనిపిస్తాయి. పాదాల్లో ఎక్కువగా కదలికలు వచ్చే కొద్దీ ఈ వాపులు ఎక్కువవుతుంటాయి. ఎక్కువ సమయం పాటు నిలబడినా, ఎక్కువ సేపు కూర్చున్నా వాపులు మరీ ఎక్కువవుతాయి. ఇలాంటి సమయంలో సరైన చికిత్స తీసుకోకపోతే లక్షణాలు మరీ తీవ్రమవుతాయి. పాదాలపై చర్మం పొడిగా మారడం, చర్మం రంగు మారిపోవడం లాంటి లక్షణాలు కనబడతాయి. ఏదైనా గాయం అయినప్పుడు ఎక్కువ రోజుల పాటు మానకుండా అలాగే ఉన్నా అది డయాబెటిస్ లక్షణం కావచ్చు. కొన్ని సార్లు ఈ అల్సర్స్ చాలా తీవ్రమవుతాయి. త్వరగా చికిత్స తీసుకుంటే ఇబ్బంది లేకుండా ఉంటుంది.

# గుండెని పదిలంగా ఉంచే సీక్రెట్ ఈ ఆహారాలను మానేయండి!



గుండె ఆరోగ్యానికి హానికరమైన ఆహారాలు - మీరు తప్పక దూరంగా పెట్టాల్సినవి1. అధిక సంతృప్త కొవ్వు పదార్థాలు:కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచే అధిక సంతృప్త కొవ్వులు గుండె జబ్బులకు కారణమవుతాయి. ముఖ్యంగా గొడ్డు మాంసం, గొర్రె మాంసం, పంది మాంసం వంటివి పరిమితంగా తీసుకోవాలి. 2. తక్కువ కొవ్వు దినుసుల ఎంపిక:మొత్తం కొవ్వు మోతాదును తగ్గించేందుకు తక్కువ కొవ్వు పాలు, పెరుగు, జున్ను వంటివి ఎంచుకోండి. వెన్న స్థానంలో ఆలివ్ నూనె లేదా కూరగాయల నూనె ఆధారిత స్ప్రెడ్‌లను వాడటం మెరుగైన ఎంపిక. 3. ప్రాసెస్ చేసిన మరియు వేయించిన ఆహారాలు:బేకన్, సలామీ, హామ్, పాస్ట్రామి వంటి ప్రాసెస్ చేసిన మాంసాన్ని మరియు ఫ్రెంచ్ ఫ్రైస్, ఫ్రైడ్ చికెన్, డోనట్స్ వంటి వేయించిన ఆహారాలను తగ్గించండి. ఇవి అధికంగా సోడియం, కొవ్వు మరియు కేలరీలను కలిగి ఉంటాయి. తక్కువ ఉప్పుతో ఉండే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవడం మంచిది. 4. చక్కెర మరియు సోడియం అధికంగా ఉండే పదార్థాలు:సోడా వంటి చక్కెర పానీయాలు బరువు పెరగడాన్ని, రక్తపోటును పెంచడాన్ని ప్రేరేపిస్తాయి. అలాగే కుకీలు, కేకులు, మఫిన్లు వంటివి కూడా పరిమితంగా తీసుకోవాలి. డబ్బాబందీ పదార్థాలు, ప్రాసెస్ చేసిన మాంసాలు వంటివి ఎక్కువగా సోడియం కలిగి ఉంటాయి, వాటినీ తగ్గించండి. 5. గుండెకు మేలు చేసే ఆహారాలు:విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ అధికంగా ఉండే రంగురంగుల పండ్లు మరియు కూరగాయలు ఆహారంలో చేర్చుకోండి. అలాగే బ్రౌన్ రైస్, క్వినోవా, తృణధాన్యాల బ్రెడ్ వంటి ఫైబర్ అధికంగా ఉండే తృణధాన్యాలను ఎంచుకోండి. 6. లీన్ ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు:స్కిన్‌లెస్ చికెన్, చేపలు, పప్పులు వంటివి మంచి లీన్ ప్రోటీన్ వనరులు. ఇవి సంతృప్త కొవ్వు తక్కువగా కలిగి ఉంటాయి. అలాగే ఆలివ్ ఆయిల్, అవకాడో, గింజలు వంటి వాటిలో గుండెకు మేలు చేసే కొవ్వులు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి.

# తెల్లజుట్టు సమస్యకు వంటింటి చిట్కా



జుట్టు తెల్లబడటం అనేది నేటి కాలంలో వయసుతో సంబంధం లేకుండా చాలా మందిని బాధిస్తున్న ఒక సాధారణ సమస్య. మార్కెట్లో లభించే రసాయనాలతో కూడిన ఉత్పత్తులు తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తున్నప్పటికీ, వాటి దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఆందోళనలు ఉన్నాయి. అయితే, ఈ సమస్యకు మన వంటింట్లోనే ఒక అద్భుతమైన మరియు సహజసిద్ధమైన పరిష్కారం ఉందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అదే, సొరకాయ ఉపయోగించి తయారుచేసే ప్రత్యేకమైన నూనె. ఈ పురాతన చిట్కా జుట్టుకు పోషణనిచ్చి, దాని సహజసిద్ధమైన నలుపు రంగును తిరిగి తీసుకురావ డానికి సహాయపడుతుంది.జుట్టు నల్లబడటానికి సొరకాయ నూనెను తయారుచేసే పద్ధతి చాలా సులభం. ముందుగా, సొరకాయను చిన్న ముక్కలుగా కత్తిరించుకోవాలి. ఈ ముక్కలను కనీసం వారం రోజుల పాటు బాగా ఎండబెట్టుకోవాలి. ఈ ప్రక్రియ వల్ల సొరకాయలోని తేమ పూర్తిగా తొలగిపోయి, దాని పోషక విలువలు నూనెలోకి చేరడానికి సిద్ధమవుతాయి. ఇలా ఎండిన ముక్కలను ఒక మందపాటి పాత్రలో తీసుకోవాలి. తరువాత, ఈ ఎండిన సొరకాయ ముక్కలకు సరిపడా మంచి నాణ్యత గల కొబ్బరి నూనెను (ఎఱతీస్త్రఱఅ జశీషశీఅబ్ శాఱశ్రీను వాడటం ఉత్తమం) జోడించాలి. ఈ మిశ్రమాన్ని మంటపై ఉంచి, సొరకాయ ముక్కలు రంగు మారే వరకు లేదా ముక్కలు పూర్తిగా నూనెలో కలిసిపోయినట్లు అయ్యే వరకు తక్కువ మంటపై బాగా మరిగించాలి. ఇలా మరిగించడం వల్ల సొరకాయలోని కీలకమైన పోషకాలు మరియు సహజ వర్ణకాలు నూనెలోకి పూర్తిగా విడుదలవుతాయి. అనంతరం, ఆ నూనెను చల్లార్చి, ఒక శుభ్రమైన వడపోత గుడ్డ సహాయంతో వడబోసి, గాలి చొరబడని గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. ఈ ఇంట్లో తయారుచేసిన సొరకాయ నూనెను వారానికి కనీసం ఒకసారి తలకు పట్టించి, వేళ్ళతో సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. రాత్రంతా ఉంచి, మరుసటి రోజు ఉదయం మైల్డ్ షాంపూతో తలస్నానం చేయడం వల్ల ఉత్తమ ఫలితం ఉంటుంది. ఇలా తరచుగా చేయడం వలన జుట్టు కుదుళ్ళు బలం పుంజుకుంటాయి, జుట్టు నల్లబడటం ప్రారంభమవుతుంది. రసాయనాలు లేని ఈ సహజసిద్ధమైన చికిత్స జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, తెల్లజుట్టు సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపడంలో సహాయపడుతుంది.

## మిగిలిన అన్నం లాభాలు తెలిస్తే నోరెళ్లబెడతారు!



చద్దన్నం (చలి అన్నం లేదా మిగిలిపోయిన అన్నం) తినడం చాలా మందికి ఇష్టం ఉండదు. కొందరు చద్దన్నాన్ని ఇష్టంగా తింటే మరికొంత మంది మాత్రం అస్సలే దానిని తినడానికి ఆసక్తి చూపరు. కానీ చద్దన్నం తినడం వలన కూడా బోలెడు లాభాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. భారతీయుల్లో చాలా మంది తమ ఇంట్లో అప్పటికప్పుడు వండిన వేడి వేడి అన్నం తినడానికే ఎక్కువ ఇంట్రస్ట్ చూపిస్తుంటారు. ఎందుకంటే ఇది రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి మంచిది. అయితే వేడి వేడి అన్నమే కాదండోయ్, మిగిలిపోయిన అన్నం తినడం వలన కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయంట. చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. ఎలా అంటే? బియ్యాన్ని ఉడికించి, దానిని చల్లబరిచినప్పుడు అందులో ఉండే కొంత పిండి పదార్థం, స్టార్చ్ రిట్రోగ్రేడేషన్ అనే ప్రక్రియ ద్వారా నిరోధక పిండి పదార్థంగా మారి, జీర్ణక్రియ నిరోధకతను కలిగి ఉంటుందంట. అందువలన ఇది రక్తంలోకి గ్లూకోజ్‌ను చాలా మెల్లగా విడుదల చేయడం వలన అప్పటికప్పుడు వండిన అన్నం కంటే, చలి అన్నం తినడం వలన డయాబెటీస్ కంట్రోల్‌లో ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. దీనిపై పరిశోధకులు తాజాగా ఓ సర్వే కూడా జరపగా, చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గిస్తున్నట్లు వారు కనుగొన్నారు. 15 మంది ఆరోగ్యకరమైన పెద్ద వారిని తీసుకొని, తెల్ల బియ్యాన్ని ఉడికించి, 4శీ%జ% వద్ద 24 గంటలు రిఫ్రిజిరేటర్‌లో ఉంచి, ఆపై మళ్లీ వేడి చేసి తినడం వలన, అప్పటికప్పుడే వండి తినే అన్నం కంటే, చద్దన్నం రక్తంలోని చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గేలా చేసిందంట. అందువలన చద్దన్నం తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా ఇది ప్రీ బయోటిక్ గా పని చేయడమే కాకుండా, గట్ బ్యాక్టీరియాను ప్రోత్సహిస్తుంది. పెద్ద పేగు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అదే విధంగా ఇన్సులిన్ సెన్సిటివిటీకి సంబంధించిన హార్మోన్స్ ను ప్రభావితం చేస్తుందంట. ఆకలిని తగ్గించి, పొట్టలోని బ్యాడ్ కొలెస్ట్రాల్ తగ్గేలా చేస్తుంది. బరువు తగ్గాలి అనుకునే వారికి, మధుమేహం సమస్యతో బాధపడే వారికి ఇది మంచి ప్రయోజనం. చల్లగా మిగిలిపోయిన అన్నం తినడం మంచిది ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో రెసిస్టెంట్ స్టార్చ్ ఉంటుంది, ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర పెరుగుదలను తగ్గించడంలో,కడుపు నిండిన అనుభూతిని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది.

## శక్తి తరగకుండా ఉండాలంటే ఈ డైట్ పాటించండి!



నలభై ఏళ్లు దాటిన మహిళల శరీరంలో అనేక ముఖ్యమైన మార్పులు చోటు చేసుకుంటాయి. హార్మోన్ల సమతుల్యతలో మార్పులు, జీవక్రియ (మెటబాలిజం) మందగించడం, ఎముకల సాంద్రత తగ్గడం వంటి కారణాల వల్ల గతంలో ఉన్నంత ఉత్సాహం, శక్తి తరచుగా తగ్గిపోతుంటాయి. ఎంత సమయానికి తింటున్నా కొన్నిసార్లు నీరసం, అలసట చుట్టుముట్టవచ్చు. ఈ దశలో, కేవలం ఆహారం తీసుకోవడం సరిపోదు. శరీరానికి తగిన పోషకాలు అంది, శక్తిని కాపాడుకోవడానికి సమతుల్యమైన (బ్యాలెన్స్‌డ్) ఆహార విధానాన్ని అనుసరించడం చాలా ముఖ్యం. నిపుణులు కూడా దీనినే గట్టిగా సూచిస్తున్నారు. శరీరానికి అవసరమైన అన్ని రకాల విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా అందాలంటే, ఆహారంలో తాజా పండ్లు, కూరగాయలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. వివిధ రంగుల్లో ఉండే పండ్లు, ఆకుకూరలు యాంటీఆక్సిడెంట్లను అందించి కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ముఖ్యంగా, ఎముకల బలం కోసం కాల్షియం, విటమిన్ డి అవసరం. వీటితో పాటు రక్తహీనతను నివారించేందుకు ఐరన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను కూడా డైట్‌లో చేర్చుకోవాలి. ఈ పవర్‌హౌస్ లాంటి ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. 40 ఏళ్లు పైబడిన తర్వాత, కండరాల క్షీణతను నివారించడానికి ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం తప్పనిసరి. అందుకే, ఆహారంలో పాల ఉత్పత్తులు (పాలు, పెరుగు, పన్నీర్), అలాగే మాంసాహారం, గుడ్లు వంటి వాటిని తగిన మోతాదులో చేర్చుకోవాలి. పాల ఉత్పత్తులు కాల్షియంను అందిస్తే, మాంసాహారం, గుడ్లు నాణ్యమైన ప్రోటీన్‌ను అందిస్తాయి. శాఖాహారులు పప్పులు, చిక్కుళ్లు, సోయా వంటి వాటిని తీసుకోవడం ద్వారా ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవచ్చు. ఈ కీలకమైన పోషకాలు శరీరాన్ని దృఢంగా ఉంచి, రోజంతా శక్తివంతంగా ఉండేలా చేస్తాయి. శక్తి స్థాయిలను మెరుగుపరచుకోవడానికి, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పీచు పదార్థాలు (ఫైబర్) ఉన్న ఆహారాన్ని డైట్‌లో పెంచాలి. తృణధాన్యాలు, పప్పులు, కూరగాయలలో పీచు పదార్థాలు అధికంగా ఉంటాయి. ఇవి మలబద్ధకాన్ని నివారిస్తాయి. అన్నిటికంటే ముఖ్యంగా, ఎంత మంచి ఆహారం తీసుకున్నా, శరీరం హైడ్రేటెడ్‌గా (సరిపడా నీటితో) ఉండటం చాలా అవసరం. అందుకే, తరచుగా, సరిపడా నీటిని తాగాలి. తగినంత నీరు తాగడం వల్ల నీరసం తగ్గుతుంది, జీవక్రియ సక్రమంగా పనిచేస్తుంది. ఈ మార్పులను పాటించడం ద్వారా 40 ప్లస్ మహిళలు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండగలుగుతారు.

## బిజినెస్ వాయిస్

# క్రిప్టో కరెన్సీకి ట్రంప్ షాక్..
# చైనాపై అదనపు సుంకాల ఫలితం



అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ట్రంప్ బాధ్యతలు స్వీకరించాక క్రిప్టో కరెన్సీలు దూసుకెళ్లాయి. అతిపెద్ద క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ గతవారంలో 1,25,000 డాలర్ల (సుమారు రూ.1.10 కోట్ల)కు చేరింది. ట్రంప్ ప్రభుత్వం క్రిప్టో అనుకూల విధానాలు అనుసరించడంతో, వీటి ధరలు దూసుకెళ్తున్నందున, పెట్టుబడులు పెట్టిన మదుపర్లు సంతోషంగా ఉన్నారు. వీరికి ఈనెల 10న గట్టి షాక్ తగిలింది. ఇది కూడా ట్రంప్ నిర్ణయం వల్లే. చైనా ఉత్పత్తులపై ఇప్పటికే 30% దిగుమతి సుంకాన్ని అమలు చేస్తున్న ట్రంప్, మరో 100% సుంకాన్ని వేస్తున్నట్లు ప్రకటించడమే ఇందుకు కారణం. దీంతో క్రిప్టో కరెన్సీల విలువలు ఒక్కసారిగా పతనమై, అంతర్జాతీయంగా క్రిప్టో ట్రేడర్లు 19 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.70 లక్షల కోట్ల) నష్టాలను మూటగట్టుకున్నారు.

**చైనాతో సంబంధం ఏంటి?**

చైనా ఉత్పత్తులపై సుంకాన్ని నవంబరు 1 నుంచి 130% చేస్తామని ట్రంప్ ప్రకటించగానే.. బిట్‌కాయిన్, ఎథేరియమ్, సొలానా, బినాన్స్.. తదితర క్రిప్టో కరెన్సీ ధరలు భారీగా పతనం అయ్యాయి. క్రిప్టో కరెన్సీల్లో చైనా పెట్టుబడులు ఎంతో అధికంగా ఉన్నాయి. చైనా ట్రేడర్ల సంఖ్య కూడా ఎక్కువే. చైనా ట్రేడర్లు పెద్దఎత్తున అమ్మకాలకు దిగడం వల్లే క్రిప్టో కరెన్సీలు భారీగా నష్టపోయాయి. క్రిప్టో ధరలు ఇంకా కొంత దిగివచ్చే అవకాశం ఉందని నిపుణులు వివరిస్తున్నారు.


**మూడేళ్ల బుల్‌మార్కెట్..**

బిట్‌కాయిన్, ఇతర క్రిప్టో కరెన్సీల్లో దాదాపు గత మూడేళ్లుగా బుల్‌మార్కెట్ కొనసాగుతోంది. చెప్పుకోదగ్గ పతనం ఇప్పుడే కనిపిస్తోంది. బిట్‌కాయిన్ విలువ జీవనకాల గరిష్ఠమైన 1.25 లక్షల డాలర్ల నుంచి తగ్గి, 1,12,160 డాలర్లకు చేరింది. ఇది లక్ష డాలర్ల స్థాయికి దిగిరావచ్చని క్రిప్టో వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అక్కడ ఆగకుండా ఇంకా కిందకు పడిపోతే క్రిప్టోల బుల్‌మార్కెట్ ధోరణి ముగిసినట్లే. కొద్ది రోజుల్లోనే క్రిప్టో కరెన్సీల మార్కెట్ విలువ 4.30 ట్రిలియన్ డాలర్ల నుంచి 3.74 ట్రిలియన్ డాలర్లకు పడింది. దాదాపు 490 బి.డాలర్ల ట్రేడింగ్ వాల్యూమ్ నమోదు కావడం గమనార్హం. బిట్‌కాయిన్ ధర తగ్గడంతో, క్రిప్టో కరెన్సీల మొత్తం మార్కెట్ విలువలో బిట్‌కాయిన్ వాటా 59 శాతానికి తగ్గింది.

**అరుదైన లోహాలపై చైనా తాజా ఆంక్షలివీ**

అరుదైన లోహాల తవ్వకం, ప్రాసెసింగ్, టెక్నాలజీ ఎగుమతులపై చైనా మరిన్ని ఆంక్షలు విధించిన నేపథ్యంలోనే, ఆ దేశంపై ట్రంప్ 100% అదనపు సుంకం ప్రకటించారు. అరుదైన లోహాల తవ్వకం, కరిగించడం, వేరుచేయడం, మెటల్ స్మెల్టింగ్, అయస్కాంత ఉత్పత్తుల తయారీతో పాటు ద్వితీయ వనరుల నుంచి అరుదైన లోహాల రీసైక్లింగ్, వినియోగానికి సంబంధించిన సాంకేతికత పరిజ్ఞానం, వాటి వాహకాల ఎగుమతులకు అనుమతులు పొందడాన్ని చైనా తప్పనిసరి చేసింది. భారత్– చైనాబీ అమెరికా–చైనా మధ్య వాణిజ్య చర్చల్లో అరుదైన లోహాల సరఫరా కీలకాంశంగా ఉంది.

## టాటా మ్యుచువల్ ఫండ్ యాప్‌లో కొత్త ఫీచర్



న్యూఢిల్లీ: ఈక్వల్–వన్‌మనీ సంస్థతో కలిసి టాటా మ్యుచువల్ ఫండ్ యాప్‌లో పోర్ట్‌ఫోలియో 360 ఫీచరును ప్రవేశపెట్టినట్లు టాటా అసెట్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 సందర్భంగా దీన్ని ఆవిష్కరించింది. వివిధ బ్యాంకు ఖాతాలు, ఫండ్స్, ఈక్విటీలు, ఎఫ్‌డీలు మొదలైన వాటి వివరాలన్నీ ఒకే దగ్గర చూసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ సీఈవో ప్రతీత్ భోబె తెలిపారు. రిటైర్మెంట్‌లాంటి ఆర్థిక ప్రణాళికలు వేసుకునేందుకు ఇన్వెస్టర్లకి సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశపెట్టిన కొద్ది నెలల్లోనే టాటా మ్యుచువల్ ఫండ్ యాప్ డౌన్‌లోడ్‌లు 6 లక్షల పైగా నమోదైనట్లు వివరించారు. పారదర్శకత, ఆవిష్కరణలపరంగా అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ పోర్ట్‌ఫోలియో 360ని తీర్చిదిద్దినట్లు ఈక్వల్%–%వన్‌మనీ వ్యవస్థాపకుడు కృష్ణ ప్రసాద్ తెలిపారు.

## రాబర్ట్ కియోసాకి హెచ్చరిక:
## ఈ ఏడాదే అతిపెద్ద క్రాష్!



ఎక్స్ వేదికగా పెట్టుబడికి సంబంధించిన విషయాలను పేర్కొంటూ ఉండే.. రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసాకి' మరో ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో.. ఈ ఏడాది అతిపెద్ద క్రాష్ జరుగుతుందని హెచ్చరించారు. ప్రపంచ చరిత్రలో అతిపెద్ద క్రాష్ జరుగుతుందని.. నేను ముందే ఊహించాను. ఆ క్రాష్ ఈ ఏడాది జరుగుతుంది. బేబీ బూమ్ రిటైర్మెంట్లు తుడిచిపెట్టుకుపోబోతున్నాయి. కియోసాకి ప్రకారం.. ఈ ఏడాది స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను పొందే అవకాశం ఉందని, ఇదే అతిపెద్ద క్రాష్ అని స్పష్టంగా అర్థమవుతోంది. స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోవడానికి టారిఫ్స్ ప్రభావం, ఆర్థిక మాంద్యం, అంతర్జాతీయ అనిశ్చితి మొదలైనవి ప్రధాన కారణాలు. డబ్బు కూడబెట్టొద్దు, నిజమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టండని హెచ్చరిస్తూనే ఉన్నాను. చాలా సంవత్సరాలుగా.. నేను సేవర్స్ ఓడిపోయేవారు అని చెబుతూనే ఉన్నాను. చాలా సంవత్సరాలుగా నేను బంగారం, వెండి, బిట్‌కాయిన్ వంటి వాటిలో పెట్టుబడి పెట్టాలని సూచించాను. వాటి ధరలు ఇప్పుడు ఏ స్థాయిలో ఉన్నాయో అందరికీ తెలుసు. ఇప్పుడు ఎథెరియంలను సేవ్ చేయమని చెబుతున్నాను. ఈ రోజు నేను వెండి %a% ఎథెరియం ఉత్తమమైనవని నమ్ముతున్నాను. ఎందుకంటే వీటి విలువ పెరుగుతూనే ఉంటుంది. వీటిని ముఖ్యంగా పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. దీనివల్ల డిమాండ్ పెరుగుతుంది. దయచేసి వెండి, ఎథెరియం లాభాలు %a% నష్టాలను మాత్రమే కాకుండా.. ఉపయోగాన్ని కూడా అధ్యయనం చేయండి. మీ సొంత ఆర్థిక జ్ఞానంతో పెట్టుబడి పెట్టండి. ఎప్పటికప్పుడు మీ సొంత ఆర్థిక తెలివితేటలను పెంచుకుంటుంటే.. తప్పకుండా ధనవంతులు అవుతారు. జాగ్రత్తపడండి అంటూ కియోసాకి ట్వీట్ చేశారు.

**పెరుగుతున్న వెండి ధరలు**

బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు అమాంతం పెరుగుతున్నాయి. ప్రస్తుతం భారతదేశంలో కేజీ వెండి రూ. 190000 వద్దకు చేరింది. ఈ సందర్భంగా "వెండి 50 డాలర్లు దాటేసింది, తరువాత 75 డాలర్లకు?.. సిల్వర్, ఎథిరియం హాట్, హాట్" (ధరలు భారీగా ఉన్నాయని) అంటూ కియోసాకి ట్వీట్ చేశారు. దీన్నిబట్టి చూస్తే.. వెండి కూడా మరింత పెరుగుతుందని తెలుస్తోంది.

## ఎంఎఫ్‌లకు తగ్గుతున్న గిరాకీ.. ఈక్విటీల్లోకి క్షీణిస్తున్న పెట్టుబడులు




**న్యూఢిల్లీ** : ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పెట్టుబడులు వరుసగా రెండో నెలా పడిపోయాయి. గత నెల సెప్టెంబర్‌లో రూ.30,421 కోట్లకే పరిమితమైనట్లు శుక్రవారం భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) విడుదల చేసిన గణాంకాలు చెప్తున్నాయి. అంతకుముందు నెల ఆగస్టులో ఇవి రూ.33,430 కోట్లుగా ఉండగా.. 9 శాతం దిగజారినట్టైంది. అయితే జూలైలో ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.42,703 కోట్లుగా ఉండటం గమనార్హం. కాగా, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు, స్టాక్ మార్కెట్లలో నెలకొన్న తీవ్ర ఒడిదొడుకులు.. ఇన్వెస్టర్లను ప్రభావితం చేస్తున్నాయన్న అంచనాలున్నాయి. అయినప్పటికీ ఈక్విటీ స్కీముల్లోకి మ్యూచువల్ ఫండ్స్ నుంచి పెట్టుబడులు రావడం వరుసగా ఇది 55వ నెల అని యాంఫీ తెలిపింది. అయితే సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (సిప్)కు ఆదరణ ఉందని, సెప్టెంబర్‌లో వీటి వాటా రూ.29,361 కోట్లని పేర్కొన్నది. ఆగస్టులో రూ.28,265 కోట్లేనని గుర్తుచేసింది.

50%దాకా నష్టాలున్నా..

మ్యూచువల్ ఫండ్స్ ఏ స్టాక్‌లోనైనా పెట్టుబడులు పెట్టాలనుకుంటే దాని గురించి విస్తృత పరిశోధనలు చేస్తాయి. అలాగే దీర్ఘకాలిక వృద్ధిపైనే దృష్టి పెడుతాయి. అయితే దాదాపు గడిచిన ఏడాది కాలంలో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు పెట్టిన సుమారు 40 షేర్లు మదుపరులకు నష్టాలనే పంచడం గమనార్హం. ఇందులో టాప్–10 షేర్లు తమ 52 వారాల గరిష్ఠ స్థాయిల నుంచి 40 నుంచి 51 శాతం విలువను కోల్పోయాయి. మిగతావి 25 శాతం వరకు నష్టాల్లో కూరుకుపోయాయి. నిజానికి నష్టాలు వాటిల్లుతున్నా నిరుడు సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు గమనిస్తే.. ప్రతీ త్రైమాసికంలో కొంతమేర ఈ షేర్లలో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు పెరుగుతూపోవడమే తప్ప తరిగిన సందర్భాలు లేకపోవడం విశేషం. ఇది లాభదాయకమేనా? అంటే.. కాలమే సమాధానం చెప్పాలి.

# పోరాడుతున్న వెస్టిండీస్..
## మూడో రోజు ముగిసిన ఆట

## క్రీడా వాయిస్





దిల్లీ: భారత్‌తో జరిగిన తొలి టెస్టులో విఫలమైన విండీస్ బ్యాటర్లు.. అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో కాస్త పుంజుకున్నారు. జట్టును ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించేందుకు పోరాడుతున్నారు. నాలుగో రోజు కూడా భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని ఎక్కువ సేపు క్రీజులో నిలిస్తే టీమ్‌ఇండియాకు కొంత లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశముంది. తొలి ఇన్నింగ్స్‌లో 140/4తో మూడో రోజు ఆటను కొనసాగించిన కరేబియన్ జట్టు.. కుల్‌దీప్ యాదవ్ (5/82) దెబ్బకు కుదేలై 248 పరుగులకు ఆలౌటైంది. దీంతో 270 పరుగులు వెనుకబడి 'ఫాలో ఆన్' నుంచి తప్పించుకోలేకపోయింది. త్యాగ్‌నారాయణ్ చందర్‌పాల్ (10), అథనాజ్ (7) విఫలమవడంతో వెస్టిండీస్ ఫాలో ఆన్‌లోనూ 35 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. దీంతో కరేబియన్ జట్టు మరోసారి కుప్పకూలి మూడో రోజే మ్యాచ్ ముగుస్తుందేమోనని అంతా భావించారు. కానీ, విండీస్ బ్యాటర్లు జాన్ కాంప్‌బెల్ (87లిబీ 145 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), షైయ్ హోప్ (66లిబీ 103 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాట పటిమ ప్రదర్శిస్తున్నారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి కరేబియన్ జట్టు 173/2 స్కోరుతో నిలిచి ఇంకా 97 పరుగుల వెనుకంజలో ఉంది. కాంప్‌బెల్, షైయ్ హోప్ అభేద్యమైన మూడో వికెట్‌కు 138 పరుగుల భాగస్వామ్యాన్ని (207 బంతుల్లో) నెలకొల్పింది. ఈ జంటను విడదీయడానికి భారత బౌలర్లు ఎంతగానో శ్రమించినా ఫలితం లేకపోయింది. కాంప్‌బెల్ 69 బంతుల్లో, హోప్ 80 బంతుల్లో అర్ధ శతకాలు అందుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ బ్యాటర్లలో అథనాజ్ (41) టాప్ స్కోరర్. షైయ్ హోప్ (36), త్యాగ్‌నారాయణ్ చందర్‌పాల్ (34), అండర్సన్ ఫిలిప్ (24), టెవిన్ ఇమ్లాచ్ (21), ఖేరీ పియెరీ (23), జస్టిన్ గ్రీవ్స్ (21), జైడెన్ సీల్స్ (13) పరుగులు చేశారు. కుల్‌దీప్ ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా.. జడేజా 3, బుమ్రా, సిరాజ్ ఒక్కో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే.

## ఒకే ఏడాదిలో వెయ్యి పరుగులు..
## తొలి బ్యాటర్‌గా చరిత్రకెక్కిన మంధాన!






భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డుల వెల్లువ కొనసాగుతోంది. భీకర ఫామ్‌లో ఉన్న ఈ లెఫ్ట్ హ్యాండెడ్ వరల్డ్ కప్‌లో అర్ధ శతకంతో మరో మైలురాయిని అధిగమించింది. ఈ ఏడాది వన్డేల్లో వెయ్యి పరుగులు పూర్తి చేసుకుంది విధ్వంసక ఓపెనర్. దాంతో, మహిళా క్రికెట్ చరిత్రలో ఒక క్యాలండర్ ఇయర్‌లో ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్‌గా కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ ఏడాది వన్డేల్లో వెయ్యి పరుగులతో ఆస్ట్రేలియా దిగ్గజం బెలిందా క్లార్క్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టిందీ బ్యాటింగ్ క్వీన్. ఆసీస్ వెటరన్ అయిన క్లార్క్ 1997లో 970 రన్స్‌తో చరిత్ర సృష్టించింది. అప్పటినుంచి .. దాదాపు 27 ఏళ్లుగా చెక్కు చెదరని రికార్డును మంధాన బ్రేక్ చేసింది. మొత్తంగా 18 ఇన్నింగ్స్‌ల్లో మంధాన 59.00 సగటుతో 1,062 పరుగులు సాధించింది.

**ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో**


ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న మంధాన పరుగుల వరద పారిస్తోంది. వరల్డ్ కప్ ముందే ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో కదం తొక్కిన ఈ డాషింగ్ బ్యాటర్ మెగా టోర్నీ తొలి రెండు మ్యాచుల్లో నిరాశపరిచింది. కానీ, వైజాగ్‌లో ప్రతీకా రావల్‌తో కలిసి ఆసీస్ బౌలర్లను ఉతికేస్తూ జట్టుకు శుభారంభం ఇచ్చిన మంధాన సెంచరీ ముందు ఔటయ్యింది. లేదంటే.. ఈ ఏడాది నాలుగు సెంచరీలతో రెండో స్థానంలో ఉన్న ఆమె తంజిమ్ బ్రిట్స్ రికార్డును సమం చేసేది. హాఫ్ సెంచరీ తర్వాత వెనుదిరిగిన మంధాన వన్డేల్లో 5వేల పరుగుల క్లబ్‌లో చేరింది.

## సౌతాఫ్రికాతో తొలి టెస్ట్.. రాణించిన పాక్ బ్యాటర్లు



రెండు టెస్ట్‌లు, మూడు టీ20లు, మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ల కోసం సౌతాఫ్రికా జట్టు పాకిస్తాన్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటనలో భాగంగా ఇవాళ (అక్టోబర్ 12) తొలి టెస్ట్ మొదలైంది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో పాకిస్తాన్ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు పాక్ బ్యాటర్లు తలో చేయి వేయడంతో పాక్ మంచి స్కోర్ సాధించింది. ఆట ముగిసే సమయానికి పాక్ 5 వికెట్ల నష్టానికి 313 పరుగులు చేసింది. పాక్ ఇన్నింగ్స్‌లో నలుగురు అర్ధ సెంచరీలు చేశారు. ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ (93) తృటిలో సెంచరీ మిస్ కాగా.. కెప్టెన్ షాన్ మసూద్ (76), వికెట్ కీపర్ మొహమ్మద్ రిజ్వాన్ (62), సల్మాన్ అఘా (52) బాధ్యతాయుతమైన అర్ధ సెంచరీలు చేశారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి రిజ్వాన్, సల్మాన్ అఘా క్రీజ్‌లో ఉన్నారు. పాక్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (2), సౌద్ షకీల్ (0) పూర్తిగా నిరుత్సాహపరచగా.. బాబర్ అజమ్ (23) మంచి ఆరంభం లభించినా భారీ స్కోర్‌గా మలచలేకపోయాడు. సౌతాఫ్రికా బౌలర్లలో సెనురన్ ముత్తుసామి 2, రబాడ, ప్రెనెలన్ సుబ్రాయన్, సైమన్ హార్మర్ తలో వికెట్ తీశారు.



# కాటాలన్ మూవీ.. పవర్‌ఫుల్ లుక్‌లో హీరో

అంటోని వర్గీస్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ "కాటాలన్". క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మిస్తున్న ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. ఇందులో హీరో మాస్ అవతార్‌లో కనిపిస్తున్నాడు. మంటల చుట్టూ సిగరెట్‌తో, కళ్లలో జ్వాలలతో కనిపిస్తున్న అతని లుక్ అదిరిపోయింది. రక్తంతో తడిసిన ముఖం, చేతులు యాక్షన్ ఇన్‌టెన్సిటీని సూచిస్తున్నాయి. పాన్-ఇండియా బ్లాక్‌బస్టర్ "మార్కో" తర్వాత, క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వస్తున్న సినిమా కావడంతో కాటాలన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్లుగానే పాన్-ఇండియా కాన్సెప్ట్‌గా భారీ స్థాయిలో నిర్మిస్తునారు. పాల్ జార్జ్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. థాయ్‌లాండ్ యాక్షన్ సన్నివేశాలను ప్రపంచ ప్రఖ్యాత ఒంగ్-బాక్ సిరీస్ యాక్షన్ డైరెక్టర్ కెచా ఖాంఫఖ్డీ తన టీమ్‌తో కలిసి రూపొందించారు. అదే సిరీస్‌లో నటించిన పాంగ్ కూడా ఈ సినిమాలో కనిపించనుంది. ఈ మూవీకి అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. కాటాలన్ లో తెలుగు నటుడు సునీల్, కబీర్ దుహాన్ సింగ్, రాపర్ బేబీ జీన్, రాజ్ తిరందాసు (పుష్ప ఫేమ్), బాలీవుడ్ నటుడు పార్థ్ తివారి (కిల్ ఫేమ్), అలాగే మలయాళ సినీ నటులు జగదీష్, సిద్ధిక్, వ్లాగర్-సింగర్ హనాన్ షా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను జోబీ వర్గీస్, పాల్ జార్జ్, జెరో జేకబ్ సంయుక్తంగా రాశారు. ఈ మూవీ మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది.



# అదిపోయే లుక్‌లో జాన్వీ!


అందాల ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ బ్యూటీ తాజాగా పింక్ లెహెంగాలో తన అందాలతో గత్తర లేపుతుంది. తన అందాన్ని చున్నీ చాటున దాచి, కొంటె చూపుతో, ప్రతి ఒక్కరి మనసు దోచేస్తుంది. మరి మీరు కూడా ఈ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.  బాలీవుడ్ చిన్నది అతిలోక సుందరి గారాల పట్టీ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. తన అందంతో ఎంతో మంది మదిని దోచుకున్న ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన క్యూట్ అండ్ బ్యూటిఫుల్ ఫొటోస్ షేర్ చేస్తుంటుంది. జాన్వీ కపూర్ ధడక్ సినిమాతో హీరోయిన్‌గా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమాతో ఈ ముద్దుగుమ్మ తన నటనతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఈ మూవీతో ఈ అమ్మడుకు మంచి క్రేజ్ రావడంతో వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. తక్కువ సమయంలోనే క్రేజీ హీరోయిన్‌గా గుర్తింపు సంపాదించుకుంది. ఇక జాన్వీ కపూర్ జూనియర్ ఎన్టీఆర్ సరసన దేవర సినిమాలో నటించిన విషయం తెలిసిందే. ఈ మూవీతో ఈ బ్యూటీ తెలుగు చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీతో తెలుగులో మొదటి బ్లాక్ బస్టర్ తన ఖాతాలో వేసుకుంది. ఇక సినిమా తర్వాత జాన్వీకి లక్కు కలిసి వచ్చిందనే చెప్పాలి. ఎందుకంటే, ఈ మూవీ తర్వాత వరసగా ఆఫర్స్ క్యూ కట్టడంతో, ప్రస్తుతం ఈ బ్యూటీ వరస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది. టాలీవుడ్ టు బాలీవుడ్ వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ జోష్‌లో ఉంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ రామ్ చరణ్ సరనస ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ, తాజాగా లేత గులాబీ రంగు లెహెంగాలో తన అంద చందాలతో మాయ చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ ఈ బ్యూటీ తన ఇన్ స్టాలో పోస్ట్ చేయడంతో అవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

# వేణు యెల్దండి 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ నుండి నితిన్ ఔట్.. మరో హీరోతో హిట్ కొట్టే ప్లాన్..!



డైరెక్టర్‌గా వేణు యెల్దండికి భారీ పేరు తీసుకొచ్చిన చిత్రం బలగం. ఆ సూపర్ హిట్ మూవీ తర్వాత ఆయన తెరకెక్కించబోయే కొత్త సినిమా 'ఎల్లమ్మ' పై గత కొంత కాలంగా టాలీవుడ్‌లో భారీ క్రేజ్ నెలకొంది. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ అధికారికంగా సెట్స్‌పైకి వెళ్లకపోవడం, హీరోయిన్, హీరో ఎంపికపై ఊహాగానాలు చక్కర్లు కొట్టడం మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మించనున్నారు. మొదట్లో 'ఎల్లమ్మ' సినిమాలో యంగ్ హీరో నితిన్ హీరోగా నటించనున్నారని ప్రచారం జరిగింది. దిల్ రాజు స్వయంగా ఒక కార్యక్రమంలో ఇది వెల్లడించారు. అంతేకాదు, నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమా రిలీజ్ అయిన తర్వాతే ఈ ప్రాజెక్ట్ మొదలవుతుందని ప్రకటించారు. అయితే ఇటీవల నితిన్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్టు వార్తలు వెలువడ్డాయి. దీంతో 'ఎల్లమ్మ' లో హీరోగా మరొకరిని తీసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయని టాక్.

నితిన్ స్థానంలో మొదటగా శర్వానంద్ పేరు వినిపించింది. కథ వినిపించగా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని కూడా ప్రచారం జరిగింది. కానీ తాజాగా సోషల్ మీడియాలో కొత్త పేరు హల్‌చల్ చేస్తోంది. అది ఎవరో కాదు ఇటీవల 'కిష్కింధపురి' సినిమాతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్. ఇప్పటికే నిర్మాతలు బెల్లంకొండతో చర్చలు జరుపుతున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ బెల్లంకొండ కాంపౌండ్ లోకి వెళ్లిందన్న వార్తలు వైరల్‌గా మారాయి. మేకర్స్ త్వరలో అధికారిక ప్రకటన చేయనున్నట్టు కూడా సమాచారం. వేణు యెల్దండికి దిల్ రాజు బలమైన సపోర్ట్ అందిస్తున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్‌ను శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై తెరకెక్కించనున్నారని సమాచారం. అన్నీ అనుకున్నట్లే జరిగితే, వచ్చే కొన్ని వారాల్లోనే ఎల్లమ్మ మూవీకి సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం బెల్లంకొండ సాయి శ్రీనివాస్, 'టైసన్ నాయుడు' అనే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. డిసెంబర్‌లో ఈ సినిమా విడుదలకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇటీవలే 'కిష్కింధపురి' హిట్ తర్వాత ఆయనకి మళ్లీ క్రేజ్ పెరిగింది. ఇప్పుడు 'ఎల్లమ్మ' లాంటి ఎమోషనల్ కంటెంట్ ఉన్న సినిమాలో ఆయన భాగం కావడం టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయింది. మొత్తానికి 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ ఎవరితో సెట్స్‌పైకి వెళ్తుందనేది అధికారిక ప్రకటన వచ్చేంతవరకూ వేచి చూడక తప్పదు



# మ్ చరణ్ పెద్ది.. డేరింగ్ సీన్ లీక్!

మెగా హీరో రామ్ చరణ్ నటిస్తోన్న  స్పోర్ట్స్ డ్రామా పెద్ది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంపై మెగా ఫ్యాన్స్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం చెర్రీ సరసన బాలీవుడ్ భామ, దేవర బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా మెప్పించనుంది. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ పుణెలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ఓ బ్యూటీఫుల్ సాంగ్‌ను తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సాంగ్ షూటింగ్‌కు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. పర్వత ప్రాంతంలో రామ్ చరణ్ స్టెప్పులు వేస్తోన్న వీడియో సోషల్ మీడియాలో లీక్ అయింది. చెర్రీ ఓ రాయిపై నిలబడి డ్యాన్స్ చేయడంపై డేరింగ్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. రామ్ చరణ్ డేరింగ్ డ్యాన్స్ అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. అయితే సాంగ్ షూట్ సీన్ లీక్ కావడం టాలీవుడ్‌లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ పాటకు ఏఆర్ రెహమాన్ సంగీతమందిస్తుండగా.. జానీ మాస్టర్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ పాట విజువల్ ట్రీట్‌గా ఉంటుందని చిత్రబృందం పేర్కొన్న సంగతి తెలిసిందే. అందుకే పర్వత ప్రాంతాల్లోనే షూటింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు 60 శాతం షూటింగ్ పూర్తయిన ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.

# సిద్ధు జొన్నలగడ్డ తెలుసు కదా ట్రైలర్.. రిలీజ్‌లో ట్విస్ట్!

టిల్లు హీరో సిద్ధు జొన్నలగడ్డ  నటించిన తాజా చిత్రం తెలుసు కదా ఈ సినిమాతో కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ మూవీలో రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం దీపావళి కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. రిలీజ్ తేదీ దగ్గర పడడంతో ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు మేకర్స్. ఈ  నేపథ్యంలోనే ట్రైలర్ రిలీజ్ చేసేందుకు రెడీ అయిపోయారు. ఈనెల 12 వైజాగ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. కానీ ఊహించని విధంగా ట్రైలర్ రిలీజ్ తేదీపై బిగ్ ట్విస్ట్ ఇచ్చారు. ఈ రోజు ట్రైలర్ రిలీజ్ చేయడం లేదని పోస్టర్ ద్వారా వెల్లడించారు. అక్టోబర్ 13న ఉదయం 11 గంటల 34 నిమిషాలకు ట్రైలర్ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో సిద్ధు ఫ్యాన్స్ కాస్తా డిస్సాపాయింట్ అవుతున్నారు. కాగా..  ఈ చిత్రం ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com